1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

దివ్యాంగులు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

- ఏఆర్ఓ, బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్

దివ్యాంగులు ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకోవాలని ఏఆర్ఓ,జీడబ్ల్యూఎంసీ కమీషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు.సాధారణ లోక్ సభ ఎన్నికల నేపద్యం లో స్వీప్-2024 కార్యక్రమం లో భాగం గా మంగళవారం వరంగల్ జిల్లా పరిధి ఐఎంఎ హాల్‌లో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ లకు ఓటు హక్కు వినియోగం పై ఏర్పాటు చేసిన చేసిన అవగాహన కార్యక్రమానికి కమీషనర్ ముఖ్య అతిథి గా హాజరై ప్రసంగించారు.ఈ సందర్బంగా ఏఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు వేయడానికి దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంప్ ల ఏర్పాటు ప్రత్యేక క్యు లైన్లు తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, వరంగల్ తూర్పు నియోజక వర్గం లో సుమారు 12 వేల మంది దివ్యాంగ ఓటర్ లు ఉన్నారని, ఓటు హక్కు విని యోగించు కోవడాన్ని బాధ్యత గా భావించాల ని, ఫాం-8 సమర్పణ ద్వారా పి డబ్ల్యు డి మార్కింగ్ ఇవ్వాలని, దివ్యాంగులు 12(డీ)సమర్పించి హోం ఓటింగ్ నమోదు చేయించుకొని ఇంటి వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉం టుందని కమీషనర్



తెలిపారు. ఈ సందర్బంగా దివ్యాంగ ఓటర్లచే ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, టీపీఆర్ఓ రాజేష్ కుమార్, తహశీల్దార్ ఇక్బాల్, టీఎంసీ రమేష్, దివ్యాంగ నాయకులు బండి రాజేందర్, చక్రపాణి, వాణి తదితరులు పాల్గొన్నారు.

'గ్రేటర్'లో అందని తాగునీరు ... రోజుకు గంటే సరఫరా

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2.53 లక్షల కుటుంబాలుండగా, 1లక్షా 95 వేల కుటుంబాలకు మాత్రమే నల్లాలున్నాయి. ఇందులో 1లక్షా 88 వేల నల్లాలకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతుంది. మరో 6 వేల నల్లాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. ఇదిలావుంటే గతంలో 24 గంటలపాటు తాగునీరందిస్తామన్న పాలకులు గత 5-6 నెలలుగా తాగునీటిని కేవలం గంటసేపు మాత్రమే సరఫరా చేయడం గమనార్హం. అధికారులు చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాకు పొంతన వుండడం లేదు. నగరంలో పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు వృధా అవుతుంది. దీన్ని ఎప్పటికప్పుడు నియంత్రించడంలో బల్దియా అధికారులు విఫలమయ్యారు. ప్రతిరోజూ 170 ఎంఎల్‌డి నీటిని ధర్మసాగర్ నుండి మూడు ఫిల్టర్‌బెడ్‌లకు తరలించి నీటిని శుద్ధీకరించి సరఫరా చేస్తున్నారు. 5-6 నెలల క్రితం 24గంటలపాటు తాగునీటిని అందిస్తామన్న పాలకులు నేడు కేవలం 1 గంట మాత్రమే తాగునీటిని అందిస్తున్నారు. నగరంలో సగం కుటుంబాలకు ప్రతిరోజు తాగునీరందితే, సగం కుటుంబాలకు రోజు తప్పించి రోజు మాత్రమే తాగునీరందుతుంది. 42 విలీన గ్రామాలు, 93 మురికివాడల్లో పరిస్థితి అధ్వాన్నంగా వుంది.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటికి ధోకా లేదని బల్దియా అధికారులు చెబుతున్నా రు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నేటికీ దేవాదుల ప్రాజెక్టు నుండి నీటిని లిఫ్టు చేస్తుండడమే అధికారుల ధీమాకు కారణం. ఇదిలావుంటే ప్రతి ఒక్కరికి 150 లీటర్ల తాగునీటిని సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించుకున్నా ఆ మేరకు సరఫరా చేయడం లేదు.

లీకేజీలతో నీరు వృథా

నగరంలో ప్రతి ఒక్కరికి 150 లీటర్ల తాగునీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నా ఆ మేరకు తాగునీటిని ఇవ్వలేకపోతున్నారు. 'అమృత్' పథకం కింద నగరంలో పలుతాగునీటి పథకానికి సంబంధించి పనులు పూర్తి చేసినా, 24 గంటలపాటు తాగునీటిని సరఫరా చేస్తామని ప్రకటించి ప్రతిరోజూ కేవలం 1-2 గంటలపాటు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో ప్రతిరోజు 170 ఎంఎల్‌డిల తాగునీటిని సరఫరా చేయాల్సి వుంది.

కొనసాగుతున్న 'దేవాదుల' పంపింగ్

గ్రేటర్ వరంగల్ నగరానికి ప్రధాన తాగునీటి వనరు ధర్మసాగర్ రిజర్వాయరే. ఈ రిజర్వాయర్‌ను దేవాదుల ప్రాజెక్టు నుండి గోదావరి జలాలను తరలించి నింపుతుండడం వల్లే నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతియేటా నగరవాసులకు ఊరట కలుగుతుంది. ఈసారి గోదావరి బేసిన్‌లో అధిక వర్షాలతో గోదావరి నదిలోకి వరద పెరుగడంతో దేవాదుల ప్రాజెక్టు నుండి నిరంతరం నీటిని రిజర్వాయర్‌లకు తరలించే ప్రక్రియ కొనసాగుతుంది. కేవలం ధర్మసాగర్ రిజర్వాయర్ నుండి ప్రతిరోజు 170 ఎంఎల్‌డిల నీటిని నగరంలోని వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్‌లకు తరలించి నీటిని శుద్ధీకరించి నగరవాసులకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కృష్ణ బేసిన్‌లో వర్షాలు అధికంగా పడకపోవడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు అధికంగా వరద రాలేదు. దీంతో పాలేరు రిజర్వాయర్‌లో జలాలు అడుగంటాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని మండలాలకు పాలేరు రిజర్వాయర్ నుండి తాగునీరందని దుస్థితి నెలకొంది.

లీకేజీలు అధికం..

గ్రేటర్ వరంగల్ నగరంలో గతంలో 3,367 లీకేజీలను గుర్తించగా, తాజాగా నగరంలో 2,217 లీకేజీలున్నట్లు గుర్తించారు. ఇందులో కేవలం 1,649 లీకేజీలకు మాత్రమే మరమ్మతులు చేశారు. మరో 568 లీకేజీలను ఇప్పటికీ మరమ్మతులు చేయలేదు. క్షేత్రస్థాయిలో ఇంకా ఎక్కువ లీకేజీలున్నాయి. దీంతో తాగునీరు లీకేజీలతో వృధాగా పోతుంది. ఎప్పటికప్పుడు లీకేజీలను మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. పర్యావసానంగా లీకేజీలతో తాగునీరు పెద్దఎత్తున వృధా అవుతుంది. వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేటలలో వున్న ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధీకరించి నగరవాసులకు సరఫరా చేస్తున్నారు. ఈ మూడు ఫిల్టర్‌బెడ్‌లలో 169.35 ఎంఎల్‌డిల నీరు శుద్ధీకరణ చేయడం జరుగుతుంది.

సగం మందికే తాగునీరు..

గ్రేటర్ వరంగల్ నగరంలో బల్దియా అధికారులు లెక్కలు చెబుతున్న మేరకు తాగునీరు అందడం లేదన్న విమర్శలున్నాయి. సగం కుటుంబాలకు నగరంలో తాగునీ రు ప్రతి రోజు అందడంలేదు. సగం కుటుంబాలకు తాగు నీరు ప్రతి రోజు అందితే, సగం మందికి రోజు తప్పించి రోజు మాత్రమే తాగునీరందుతుంది. గ్రేటర్ వరంగల్‌లో విలీనమైన 42 విలీన గ్రామాలకు, పలు శివారుల కాలనీలకు తాగునీరందడం లేదు. నగరంలోని 93 మురికివాడల్లో మెజార్టీ మురికివాడలలో తాగునీటి ఎద్దడివుంది. ఈ మురికివాడలలో ప్రజలకు తాగునీటి వసతి లేకపోవడంతో తా గునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

రూ.650 కోట్లతో 'అమృత్' పథకం పూర్తి చేసినా, నేటికీ నగరంలో తాగునీటికి తండ్లాట తప్పడం లేదు.

వాణి విద్యానికేతన్ అనుమతి రద్దుచేయాలి

- ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



నవతెలంగాణ-వరంగల్

వాణి విద్యానికేతనం అనుమతి రద్దుచేయాలని వరంగల్ డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ చక్రవర్తికి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున జిల్లా కార్యదర్శి లాదల్లా శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతంలోని వాణి విద్యానికేతన్‌లో నాలుగో తరగతిని చదువుతున్న కీర్తన అనే విద్యార్థిని చితకబాదిన సంఘటనపై విచారణ జరిపి విద్యార్థినికి న్యాయం చేయవలసిందిగా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఆటస్థలం ఫైర్ సేఫ్టీ క్వాలిఫై టీచర్, ఒక బ్రాంచ్ కే పర్మిషన్ ఉంటే మరొక బ్రాంచ్ పేరుతో అడ్మిషన్ చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక డబ్బులు వసూలు చేస్తున్న వాణి విద్యానికేతనం యాజమాన్యం చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపు రద్దు చేయవలసిందిగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ ఛాంబర్‌లో అధ్యాపకుల నిరసన

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఛాంబర్‌లో అధ్యాపకులు నిరసన తెలిపారు. ఈ సందర్బంగా రిజిస్ట్రార్ ఛాంబర్‌లో డాక్టర్ మమత, శర్మ మాట్లాడుతూ తమ నియామకాన్ని ఇల్లీగల్ అంటున్నారు ఏవిధంగా ఇల్లీగల్ అవుతుందో నిరూపించాలని అన్నారు. అందరూ అధ్యాపకులు నియామకం జరిగినట్లుగానే తమ నియాగమకం జరిగినప్పటికీ తమను ఇల్లీగల్ అని సంబోధించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా యూనివర్సిటీ అధికారులు తమను తీవ్ర ఇబ్బందుల గురిచేస్తున్నారన్నారు. జీతాలు ఇవ్వకుండా పదోన్నతులు నిలిపివేస్తూ కనీసం తమను రెగ్యులర్ ఉద్యోగులుగా కూడా గుర్తించకుండా ఇబ్బందుల గురి చేస్తున్నారని అన్నారు. హైకోర్టులో ఈరోజు జరిగిన వాదనలో తమను 22న తొలగిస్తున్నట్లు చెప్పడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నామని అన్నారు. తాము ఏదైనా తప్పు చేస్తే నిరూపించాలి కానీ వేధించడం సరైనది కాదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేర కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం


నవతెలంగాణ-నర్సంపేట



రాష్ట్ర ప్రభుత్వం మేర కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై మేర కులస్తులు హర్షం వెలుబుచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మేర సంఘ ప్రతినిధులు కలుసుకొని కృతజ్ఞతలు చెప్పారు. పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మేరలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కార్పొరేషన్ దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. మేరలకు అండగా ఉంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మండలాధ్యక్షులు ఓడపల్లి గోవర్ధన్, జిల్లా కోశాధికారి రామగిరి యాదగిరిస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి గట్ల రజనీకాంత్, మాజీ అధ్యక్షులు గట్ల రఘుపతి, ఉపాధ్యక్షులు గట్ల శ్రీను, నోముల భాస్కర్, గట్ల కమలాకర్, రామగిరి బిక్షపతి, సహాయ కార్యదర్శి ఓదెల సురేష్, రామగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-పర్వతగిరి



బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ కృషి జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మండలంలోని గోపనపల్లిలో గ్రామ పార్టీ అధ్యక్షులు నాగార్జున ఆధ్వర్యం లో మంగళవారం గ్రామపార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంగా పలు సంక్షేమ పథకాలను బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందించే విధంగా నాయకులు, కార్యకర్తలు కంకణ బద్ధులై కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులుగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూడల మల్లిఖార్జున స్వామి ఆలయ చైర్మన్ బెల్లం రాధిక రాజు, నాయకులు ఎండి పాషా, సావిత్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల వెతల చిత్రీకరణ హర్షణీయం

నవతెలంగాణ-శాయంపేట

చేనేత కార్మికులు వస్త్ర తయారీకి పడుతున్న కష్టాలను చేనేత అన్న బ్రతుకు చిత్రం -1, వీడియోను ఆర్ సినీ ట్యూబర్ చీరాల రాకేష్ కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరణ చేశారు. ఈ వీడియోను మంగళవారం చేనేత సొసైటీ ముందు సొసైటీ చైర్మన్ మామిడి శంకర్ లింగం, డైరెక్టర్లు బూర లక్ష్మీనారాయణ, దిడ్డి ప్రభాకర్, రంగు ఆనందం, మేనేజర్ మామిడి రాము యూట్యూబ్లో అప్లోడ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సొసైటీ చరిత్రను, కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకుని వీడియో చిత్ర రూపంలో తీయడం అభినందించదగ్గ విషయమనీ అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో చేనేత మిత్ర పేరిట ప్రతినెల రూ.2వేలు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చేనేత మిత్ర అందడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి చేనేత మిత్ర స్థానంలో రేవంతన్న చేనేత పింఛన్ పేరిట కార్మికులకు ప్రతినెల 2,000 రూపాయలు బ్యాంక్ ఖాతాలో జమచేయాలని కోరారు.

అంగన్వాడిలోనే పిల్లలకు పౌష్టికాహారం

నవతెలంగాణ-సుబేదారి

అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు సరైన పౌష్టిక ఆహారం అందుతుందని సూపర్ వైజర్ కవిత అన్నారు. హనుమకొండ ఐసిడియస్ ప్రాజెక్ట్, అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సూపర్ వైజర్ కవిత అధ్యక్షతన నిర్వహించడం జరిగిందని అంగన్వాడీ టీచర్ సరస్వతి దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సరస్వతి, రమ, వినీల, అంగన్వాడి హెల్పర్స్ ,ఆశాలు. తల్లులు పాల్గొన్నారు.

శానిటేషన్, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి : జీడబ్ల్యుఎంసీ కమిషనర్



నవతెలంగాణ-వరంగల్

శానిటేషన్, నీటిసరఫరా పై ప్రత్యేక దష్టి సారించా లని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.మంగళవారం వరం గల్‌లోని పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తో పాటు వరం గల్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సానిటేషన్ స్థితిగతులను కమీషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోతన ట్రాన్సుర్ స్టేషను పరిశీలించిన కమిషనర్ చెత్త తరలింపు విధానాన్ని, ప్లాంటు సామర్థ్యం, పనిచేసే విధానాన్ని ముఖ్య ఆరోగ్యాధికారిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం వరంగల్ బ్యాంక్ కాలనీ ప్రాంతంలో పర్యటించి స్థానికులను నీటి సరఫరా తీరు ను అడిగి తెలుసు కుంటూ ప్రతిరోజు ఎంతసేపు నీరు సరఫరా అవుతుంది ? నీటి సరఫరా తీరును అధికారులు పర్యవేక్షిస్తున్నారా? నీటి పన్నులు చెల్లించారా? అని క్షేత్ర స్థాయి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రాంత పరి ధి లోని ఈఎస్ఎల్ఆర్ కు ఎన్ని నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని ఏఈని అడుగగా సుమారు 3 వేలు ఉన్నాయని తెలుపగా, సానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడిన కమిషనర్ ఉదయం ఎన్ని గంటలకు విధులకు హాజరవుతారని ?అడిగి తెలుసుకున్నారు.

అనంతరం దేశాయిపేట గొల్లవాడలో పర్యటించి నీటి సరఫరా విధా నాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ బి నగర్ పద్మనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా తీరును స్థానికులను అడిగి తెలుసుకొని నీటి వధా ను అరికట్టాలని, అవసరాల మేరకు నీటిని వినియో గించుకోవాలని ఆన్ ఆఫ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని, లైన్‌మెన్‌లు ఎప్పటికపుడు లీకేజీలను అరికట్టేలా చూడాలని ఈ సందర్బంగా కమీషనర్ అన్నారు.

కమిషనర్ వెంట ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ ఈఈ శ్రీనివాస్‌సానిటరీ సూపర్వైజర్ సాంబయ్య డీఈలు సారంగం, రంగారావు, కష్ణమూర్తి, రవీందర్, ఏఈలు సౌజ న్య సతీష్, సానిటరీ ఇన్స్పెక్టర్లు శ్యామ్ రాజ్, ధరమ్ సింగ్, ఎల్లా స్వామి తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాట తొలి మహిళా యోధురాలు మల్లు స్వరాజ్యం

- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల

నవతెలంగాణ-వరంగల్

రజాకార్లను తరిమికొట్టిన తెలంగాణ సాయుధ పోరాట తొలి మహిళా యోధురాలు మల్లు స్వరాజ్యం అని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. వరంగల్ కరీమా బాద్ ఏరియా అధ్యక్షులు అప్పాజీ వాణి అధ్యక్షతన మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రత్న మాల, అప్పాజీవాణి హాజరై మాట్లాడుతూ రజాకార్లను తరిమి కొట్టి దొరల ను గడుల్లో బంధించి అయ్యాని బాంచన్ కాల్ మొక్కుతా దొర అనే మాటను, వెట్టి చాకిరికి విముక్తి చేసి రైతులను భూమిలేని పేదలను అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచినదన్నారు. రాజా కార్ గుండెల్లో సింహం గా నిలిచినదన్నారు.



డ్రైనేజీ కాల్వల నిర్మాణాలు పెద్దగా... కల్వర్టులు చిన్నగా...




నవతెలంగాణ-పర్వతగిరి

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుంటే రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా అధికారులు,కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను నీళ్లపాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే దౌలత్ నగర్ గ్రామంలో గరుగు చేన్నమల్లు ఇంటి దగ్గర నుండి మాజీ వార్డ్ మెంబర్ పల్లకొండ రమేష్, పల్లకొండ సమ్మయ్య మరియు సూర్యప్రకాష్ ఇంటి వెనకాల నుండి సైడ్ డ్రైనేజ్ కాలువలు రోడ్డు వెంబడి నిర్మిస్తున్నారు. నీరు ఏమాత్రం బయటికి వెళ్లకుండా మోరీలు చిన్నగా, కాలువలు పెద్దగా నిర్మిస్తూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా ఎం 30 గ్రేడ్‌తో వేయవలసిన కాంక్రీటు ఎం 20 గ్రేడ్ తో వేస్తున్నాడు. ఇలా నిర్మాణం పనులు నాసి రకం గా చేస్తూ చేతులు దులుపు కుంటున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వ్యవహరించిన విధానంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమలతను వివరణ కోరగా నేనేం చేయాలంటూ చెప్పి చెప్పనట్లుగానే చెప్పింది. స్పెషల్ ఆఫీసర్, పిఆర్ఎస్ ఏఈ కవితను 'నవతెలంగాణ' వివరణ కోరగా నేను పనులు ఆపమని సదరు కాంట్రాక్టర్ కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఏది ఏమైనా సంబంధిత అధికారులు స్పందించడం లేదనీ, గ్రామంలో ఎన్నో సమస్యలు వున్నప్పటికీ పరిష్కారం కావడం లేదని స్థానిక ప్రజలు విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో మొదటి వార్డు ను ఎవరు పట్టించుకోవడం లేదని, కాల్వ వెంబడి నివసిస్తున్న గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నిర్మాణ పనులను సోమవారం రాత్రికి రాత్రే నాసిరకంగా సైడ్ డ్రైనేజ్ కాలువలు నిర్మాణం చేపట్టారని, మోరీలు సరి చేయకుండా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పరకాల



రజక సంఘం నూతన కమిటీని మంగళ వారం రజక సంఘం మండల నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పరకాల పట్టణ రజక సంఘం నూతన అధ్యక్షులుగా మామూళ్లపల్లి సారంగపాణి ఎన్నికగాగా ప్రధాన కార్యదర్శిగా మాదాసి రామ్మూర్తి ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పోచంపల్లి లక్ష్మణ్, నేరెళ్ల రవి, కోశాధికారిగా గణేష్ ,సహాయ కార్యదర్శిగా బుచ్చిబాబు ,నరసింహ రాములు ,సమ్మయ్య ఎన్నికగాక కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో వారిని రజక సంఘం మండల నాయకులు ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి సత్కరించారు.

ఈ సందర్భంగా రజక సంఘం పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన సారంగపాణి మాట్లాడుతూ నా ఎన్నికకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలుపుతూ రజక సంఘం అభివృద్ధికి పాటుపడి తోడుంటానని అన్నారు.

దాతలు చేయూతనందించాలి

నవతెలంగాణ-ఐనవోలు

మండల కేంద్రంలో చాలా కాలం నుండి ప్రభుత్వ స్కూల్ లో జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబనికి చెందిన వాకిటి కొమురయ్య అనారోగ్య కారణాల రీత్యా సోమవారం మతి చెందారు. వారి కుటుంబాన్ని సామాజిక కార్యకర్త రాజారపు రాజ్ కుమార్ ,జీఎంపీస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల చిన్న రాజులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి స్వంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం వాకిటి అనసూర్య, వాకిటి సంపత్ రెడ్డిల కుటుంబాన్ని కి ఎవరైనా దాతలు మానవ దక్పథంతో ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలన్నారు.

హమాలీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకొడపాక గ్రామంలో హమాలి యూనియన్ నూతన కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షులు కోగిల కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోగీల సంపత్, ఉపాధ్యక్షులుగా కోగీల కిరణ్, దాడువాయిలుగా శరత్, సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మంత్రి సురేఖను కలిసిన చైర్మన్లు



నవతెలంగాణ-వరంగల్

తెలంగాణ స్టేట్ కో ఆపరే టివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫె డరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి మం గళవారం హైదరాబాద్‌లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధ ర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అదేవి ధంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, తెలంగాణ మహిళా క మిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన నేరెళ్ళ శారద, గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నియ మితులైన ఎండి.రియాజ్‌లు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ వారికి శుభా కాంక్షలు తెలిపారు.

గిరిజన సహకార సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

21 నుంచి 23 వరకు నామినేషన్‌లు, ఏప్రిల్ 1న పోలింగ్

నవతెలంగాణ-నర్సంపేట

గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సొసైటీ పాలకవర్గం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర సహకార ఎన్నికల అథారటీ అదనపు రిజిస్ట్రర్ జీ.శ్రీనివాసరావు ఎన్నికల షెడ్యూల్‌ను జారీ చేశారు. సొసైటీలో మొత్తం ఎంసీ మెంబర్లు 5 కాగా 2 స్త్రీలు, 4గురు ఓపెన్ కేటగిరి సీట్లకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 24న నామినేషన్‌లను స్క్రూటినీ, 26న నామినేషన్‌ల ఉపసంహరణ, అభ్యర్థుల పేర్లు, గుర్తుల కేటాయింపు, ఏప్రిల్ 1న పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజుల వ్యవధిలో ఆఫీస్ బేరర్స్‌ల ఎన్నిక తదుపరి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కొమురారెడ్డి

నవతెలంగాణ-హసన్‌పర్తి

తెలంగాణ రైతు రక్షణ సమితి హసన్‌పర్తి మండల అధ్యక్షుడిగా నాగారం గ్రామానికి చెందిన కట్కూరి కొమురారెడ్డిని నియమిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ చేతుల మీదుగా కొమురారెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌల్ల రామారావుల కు కతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని వడ్లకొండలో శ్రీ రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం చింతకాయల మహేశ్వరి-సురేష్ దంపతులు వడ్లకొండ గ్రామ వాస్తవ్యులు తమ వంతు సహాయంగా విరాళం రూ.50,116లు నగదు రూపకంగా మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్ కు మంగళవారం అందజేశారు.

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన వరంగల్ సీపీ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ లోని మార్కజీ హై స్కూల్ లో పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ పర్యవేక్షంచారు. పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టిపెట్టాలని, సెక్షన్ 144 అమలు లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలని అలాగే అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం చేయరాదని, ముఖ్యం పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలను నోసెల్ ఫోన్‌జోన్‌గా పరిగణలోనికి తీసుకుపోవడంతో పాటు పరీక్షా కేంద్రం పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని, ముఖ్యంగా సిసి కెమెరాల పనితీరుపై సంబంధిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-సుబేదారి



హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రంలోఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ఎంతమంది గైర్హాజరయ్యారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదు

నవతెలంగాణ-భీమదేవరపల్లి



కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు చర్యలతో బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించబోమని జెడ్పిటిసి వంగ రవి, మాజీ ఎంపీపీ సంఘసంపత్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు మండల సురేందర్‌లు అన్నారు. ముల్కనూర్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం మా ట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు దార్న శ్రీనివాస్ పట్టా భూమిలోకి కస్తూరి లక్ష్మి అనే మహిళ అక్రమ కట్టడం చేశారని అన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు కస్తూరిలక్ష్మీ అక్రమకట్టడం చేయడానికి సహకరించారని మండిపడ్డారు. ఈ విషయంపై ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారన్నారు. సర్వే చేయించి హద్దులు నిర్ణయించకుండా అక్రమ కట్టడం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజనాచారి, మాడుగుల అశోక్, బిక్షపతి, పూర్ణచందర్, రాజు, ప్రేమ్ రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారి చేయాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హనుమకొండ నడిబొడ్డున ఉన్న నయీమ్ నగర్, రాజాజీనగర్, రాంనగర్ సమ్మెనగర్ కాలనీ ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో 60 ఫీట్ల రోడ్డు భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేసుకుంటూ వచ్చి రాజాజీ నగర్ చివరిలో వదిలేశారు. అక్కడ నుంచి నీరు సజావుగా వెళ్ళిపోకపోవడం వలన నీరు ఎక్కువగా నిలకడగా ఉండడం వలన గుర్రపు డెక్క ఆకు పెరిగి దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న సమస్య మాత్రం పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల మందు పిచికారి చేయడంలో అధికారులు విఫలమయ్యారని కాలనీవాసులు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రి పాలవుతున్నారని కాలనీవాసులు అంటున్నారు. అధికారులు స్పందించి దోమలమందు పిచికారి చేయాలని కాలనీవాసులు తోట పాపన్న, జనార్దన్ రెడ్డి, సురేందర్ రెడ్డి రణధీర్ రెడ్డి, తండు నాగయ్య, శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, రవీందర్ అధికారులను కోరారు.

ఎంపీఓపై ఎంపీపీపట్ల నిరసన

నవతెలంగాణ-పరకాల



నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల ఎంపీఓపై ఎంపీపీ ఆ కారణంగా దాడి చేయడంపై మంగళవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు స్వేచ్ఛ వాతావరణం లో బాధ్యతలు నిర్వర్తించేలా ప్రజా ప్రతినిధులు సహకరించాలి తప్ప దాడి చేయడం చరిత్రహీనమన్నారు. ఎంపీపీ దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. కోడేరు ఎంపీఓ దాడిపై బాధ్యులైన ఎంపీపీ పై ప్రభుత్వం కఠిన చర్య తీసుకోవాలని ఇలాంటి చర్యలు మళ్ళీ పునరావత్తం అయితే ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టి తగిన గుణపాఠం చెప్పేలా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, ఏపీఓ ఇందిరా, సూపరింటెండెంట్ శైలశ్రీ, పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుండి సుమారు 100మంది బిఆర్ఎస్ కార్యకర్తలు తాళ్లపల్లి రవీందర్ ఆధ్వర్యంలోపెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం విశాల్ భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మొన్నటి ఎన్నికల వరకు ప్రజలను మోస పూరిత మాటలతో మభ్యపెడుతూ కాలం వెల్లదీశారన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని తెలిసి ఈ రోజు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బిఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేలుపుల జాన్ వెస్లీ, తాళ్లపల్లి చిన్న, గిరబోయిన శ్యామ్, పులి శేరు అరుణ్ కుమార్, పసునూరి మనోహర్, మంద సారయ్య, చింతల బిక్షపతి, అబ్రహం, చింతల మహేందర్, మహమ్మద్ ఇజాజ్, పి నరేష్, పసునూరి మున్నా, అంబాలా రాజు పున్నం, ప్రసన్న, ప్రశాంత్, జగదీశ్, అవినాష్, మహేందర్, కిరణ్, రాజేష్మ మహేష్, సతీష్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, నెక్కొండ కిషన్, తాళ్లపల్లి మేరీ, అనుకోటి పున్నం తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని హౌజుబుజుర్గుకు చెందిన బొల్లపెల్లి కట్టయ్య గౌడ్ మంగళవారం మృతిచెందగా బీజేపీ నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మంగళవారం భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మతుని కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలవంతుల రాజు, ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, సముద్రాల రవి, బయ్య పైడి, నజీర్, పూజారి రవీందర్, యాదకుమారస్వామి, జిర్ర శ్రీకాంత్, భోగిని రాజకుమార్, సాంబయ్య ఉన్నారు.

పోరాటాలను ముందుకు తీసుకువెళ్లడమే మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి



- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్న మతోన్మాదులు
- సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి

నవతెలంగాణ ఎన్జీవోస్ కాలనీ

ప్రజా వర్గ పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే అమరజీవి కామ్రేడ్ మల్లు స్వరాజ్యంకు మనం ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మహిళా ఉద్యమ నేత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతి కార్యక్రమం మంగళవారం హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్ అధ్యక్షతన జరిగింది. ముందుగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి బొట్ల చక్రపాణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, సామాజిక న్యాయసాధన కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన అమరజీవి వీర వనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అని అన్నారు. నాటి నైజాం నవాబు దుర్మార్గపు పరిపాలన కు వ్యతిరేకంగా, పటేల్, పట్వారిలు జమీందారులు జాకీర్దారులు భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సంఘంపెట్టి, ఎర్రజెండా చేతపట్టి భూస్వాములను, నైజాం రజాకారులను తరిమి కొట్టిన వీర వనిత విప్లవ ధ్రువతార కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అని అన్నారు. నిజాంసంస్థానంలో కనీస పౌరహక్కులు, విద్య వైద్య అవకాశాలు శూన్యం, రైతుల మీద మోయలేని పన్నుల భారం, మధ్యయుగాలనాటి ఫ్యూడల్ అణచివేత, రాచరిక రాజ్యదురాగతాలు, దుర్మార్గాలు సాంఘిక దోపిడీ, ఆర్థిక దోపిడీ, దుర్మార్గపు పరిపాలన కు వ్యతిరేకంగా నాడు సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం లో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం కీలక పాత్ర పోషించారని అన్నారు.

సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణలో 3వేల గ్రామాల్లో గ్రామరాజ్యాలు ఏర్పడ్డాయని, 4000 మంది కమ్యూనిస్టులు, ప్రజలు వీరమరణం పొందారని, 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడ్డాయన్నారు. మహోన్నత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేడు మతోన్మాదులు వక్ర భాష్యాలు చెబుతున్నారని, వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతంరంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. వాస్తవ చరిత్ర విషయాలు తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు. రానున్నకాలంలో ప్రజావర్గ పోరాటాలు విస్తతంగా నిర్వహించడమే అమర జీవి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం కు మన మిచ్చే ఘననివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపెల్లి వాసుదేవ రెడ్డి, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, మంద సంపత్, డ్.భాను నాయక్ నాయకులు తౌటం వెంకటయ్య కుక్కమూడి రవి, వల్లెపు రాజు, లింగమూర్తి, బి.స్వామిదాసు, అరుణ, రమ, తదితరులు పాల్గొన్నారు.

అక్షర ది ప్లానెట్ స్కూల్ ముందు ఉపాధ్యాయుల ఆందోళన

- 4 నెలలుగా జీతాలు ఇవ్వలేదని స్కూల్‌కు తాళం
- విస్మయానికి గురైన తల్లిదండ్రులు
- కేయూ పీఎస్‌లో ఉపాధ్యాయుల ఫిర్యాదు
- ఎంఈవోకు అధ్యాపకురాలి మొర
- రంగంలోకి 'నవతెలంగాణ' దిగివచ్చిన యాజమాన్యం
- గంట లోపే ఫోన్ పే ద్వారా జీతాల చెల్లింపు





నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని అక్షర ది ప్లానెట్ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వడం లేదని ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని బాధిత ఉపాధ్యాయులు కేయూ పోలీసు స్టేషన్‌తో పాటు మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం తీరుకు కలత చెందిన బాధిత ఉపాధ్యాయులు, వాచ్‌మెన్ జీతాలుఇవ్వని యాజమాన్యంపై అక్కసు కక్కారు. ఉదయం పాఠశాల గేటుకు తాళం వేసి విద్యార్థులను పాఠశాలకు హాజరు కాకుండా అడ్డుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎదుటే 2గంటల పాటు నలుగురు ఉపాధ్యాయినీలు ఆందోళనచేశారు. జీతాలు చెల్లిస్తేనే గేటు తాళం తీస్తామని పాఠశాల గేటుఎదుటే వారు భీష్మించుకొని కూర్చున్నారు. ఉపాధ్యాయుల తీరుతో విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయానికి గురయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకువచ్చిన తమ పిల్లలను ఉపాధ్యాయుల ఆందోళనతో తిరిగి తమ ఇండ్లకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఓ విద్యార్థిపేరెంట్ 'నవతెలంగాణ' దినపత్రిక విలేఖరికి సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన మండల విలేఖరి కందుకూరి సంజీవ్ పాఠశాల ఉపాధ్యాయుల వద్దకు చేరుకొని విషయం తెలుసుకొని యాజమాన్యంతో పాటు మండల విద్యాశాఖ అధికారి, కేయూ పోలీసులకు సమాచారం అందించగా తక్షణమే యాజమాన్యం రంగంలోకి దిగారు. నవతెలంగాణ ఎఫెక్ట్‌కు కదలివచ్చిన యాజమాన్యం ఉపాధ్యాయులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే బాధిత ఉపాధ్యాయులకు బకాయిపడ్డ నాలుగు నెలల జీతాలను పాఠశాల యాజమాన్యం ఫోన్ పే ద్వారా చెల్లించారు.

దీంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకొని 'నవతెలంగాణ' దినపత్రికకు, మండల విలేఖరి కందుకూరి సంజీవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యం

- జిల్లా 3150 గవర్నర్ బుచ్చిరెడ్డి శంకర్‌రెడ్డి



నవతెలంగాణ-సుబేదారి

ప్రజలకు సేవ చేయడమే రోటరీ లక్ష్యం అని జిల్లా 3150 గవర్నర్ బుచ్చిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో వైద్యశాలకు 6 వీల్ చైర్స్ ,6 స్ట్రక్చర్స్ (లక్ష రూపాయల విలువ) లని బుచ్చిరెడ్డి శంకర్ రెడ్డి చేత అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆఫ్ హనుమకొండ చాలా చక్కటి కార్యక్రమాన్ని చేపట్టారని, గర్భిణీ స్త్రీలు వైద్యశాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బంది పడకుండా వీల్‌చైర్స్, స్ట్రక్చర్స్ వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన క్లబ్ అధ్యక్షులు రవీంద్రనాథ్‌ని, క్లబ్ సభ్యులందరినీ అభినందించారు.ఇవే కాకుండా వైద్యశాలకు సుమారుగా రూ.25 లక్షల పైన ఎటువంటి వైద్యపరమైన పరికరాలు అవసరం ఉంటే నాకు తెలియజేయండని, వాటిని సమకూ రుస్తానని వైద్య బృందానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అన్నం రవీంద్రనాథ్ మాట్లాడుతూ వీల్ చైర్స్అండ్‌స్ట్రక్చర్స్ వాటి అవసరం ఉందని తెలియగానే మా సభ్యులకు నేను తెలియపరచడం తోనే వెంటనే మాలో కొంతమంది సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు అందించగా వారి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ సహాయం చేసిన మా సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా మా క్లబ్బును మీరు సంప్రదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెంట్ నిర్మల, క్లబ్ కార్యదర్శి కెవిఎస్ శిరీష్ కుమార్, కోశాధికారి గంగోజుల నరేష్, సభ్యులు మనోహర్ రెడ్డి, వంగ రాజిరెడ్డి, రామ్ రెడ్డి, మాదాల సతీష్ కుమార్, విజయ్, రవీందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రావు, శ్రవణ్, మంజుల, బిందు, రమా లక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో లోకల్ సీడ్ విత్తనాలను వేయాలి

- డీఆర్డిఓ నాగ పద్మజ

నవతెలంగాణ-శాయంపేట



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీల్లో త్వరగా మొలకెత్తే లోకల్ సీడ్ కానుగ, చింత, గుల్మహర్, కుంకుడు, కరివేపాకు, మునగ, బొప్పాయి వంటి విత్తనాలను వేయాలని డిఆర్డిఓ, పిడి నాగ పద్మజ అధికారులను ఆదేశించారు. మండలంలోని సూర్యానాయక్ తండ గ్రామ నర్సరీని డిఆర్‌డిఓ మంగళవారం సందర్శించి పరిశీలించారు. లోకల్ కటింగ్స్, పూలక్రోటాన్స్ మొక్కలు పెంచాలని, ప్రైమరీ బెడ్లలో విత్తనాలు వేయాలని పలుసూచనలు చేశారు. మండలంలోని సూర్జహాన్ పల్లి, కాట్రపల్లి, రాజుపల్లి, సాధోనిపల్లి, వసంతాపూర్, గంగిరేణిగూడెం, కొప్పుల, జోగంపల్లి, పెద్దకొడపాక, గోవిందాపూర్ గ్రామాలలోని నర్సరీలను ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. లోకల్ కటింగ్స్‌పెట్టి పది రోజులైనా మొలకెత్తని వాటిస్థానంలో మరల కొత్తగా కటింగ్స్ పెట్టాలని, విత్తనాలు వేసి 15 రోజులు దాటిన మొలకలు రానీ వాటి స్థానంలో మునగ, బొప్పాయి, కరివేపాకు వంటి విత్తనాలు వేయాలని సూచించారు. వారి వెంట ఏపీఓ కీర్తి అనిత, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దిలీప్ కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఆవుల దిలీప్ ఆన్లైన్ మోసంతో ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీ మహేశ్వర మున్నూరు కాపు సంఘం గౌరవాధ్యక్షులు చింతనిప్పల రాజ మల్లయ్య, మాజీ సర్పంచ్ గజ్జెల లావణ్య రాజు, సభ్యులు చింతనిప్పల రవీందర్, నరసయ్య, మొగిలి, రమేష్, చింతం బుచ్చయ్య, గడ్డం సాంబయ్య, రాజు, గుండా సాంబయ్య, సతీష్, గొలుసుల దేవేందర్, కోసరి మహేందర్ లు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.

సిమెంట్ బెంచీల బహుకరణ

నవతెలంగాణ-శాయంపేట



మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలకు స్థానిక మాజీ సర్పంచ్ కందగట్ల రవి తన తండ్రి కందగట్ల సమ్మయ్య స్మారకార్థం 12 వేల విలువ కలిగిన 4 సిమెంట్ బెంచీలను మంగళవారం బహుకరించారు. పాఠశాలలో ప్రతినెల రెండవ ఆదివారం పేరెంట్స్ విజిటింగ్ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూర్చోవడానికి పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానిక ప్రిన్సిపాల్ మోతే రాజ్ కుమార్ సిమెంట్ బెంచీల విషయమై మాజీ సర్పంచ్ కందగట్ల రవి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన రవి తన తండ్రి స్మారకార్థం 4 బెంచీలను పాఠశాలకు బహుకరించారు. మాజీ సర్పంచ్ రవికి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వినుకొండ శంకరాచారి, వల్పదాసు సదాశివుడు, గాజుల రవి, కొత్తపల్లి రవి పాల్గొన్నారు.

23లోపు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ చేసేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిని దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్ 21న ఆదివారం ఉదయం 11 నెలల నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష పూర్తి వివరాలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెబ్సైట్ టీఎస్ డబ్ల్యూ ఆర్ ఐ ఈ ఎస్. ఇన్ లో వివరాలను తెలుసుకోవచ్చని అన్నారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకొని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సుభాషిని దేవి తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన జంగా

- లాభసాటి వ్యవసాయ రంగ ఉత్పత్తులపై రంగం సిద్ధం
- సానుకూలంగా స్పందించిన సీఎం భట్టి



నవతెలంగాణ-హసన్‌పర్తి

తెలంగాణ ఆయిల్ సీడ్, గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి మంగళవారం హైదరాబాద్ ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం ఫైనాన్స్ మినిస్టర్ మల్లు భట్టివిక్రమార్కని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలంగాణలో రైతులకు అధిక దిగుబడినిచ్చే ఆయిల్ ఫామ్ సాగును పెంచి లాభసాటి వ్యవసాయ ఉత్పత్తులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆయిల్ ఫామ్ సాగుపై శాస్త్రవేత్తలు రైతులకు మేలైన విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సాగు దిగుబడులు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ ఉత్పత్తి రంగంలో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక లాభాలను ఇచ్చే పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా నిర్వహించేందుకు రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించి రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగును మరింత లాభసాటిగా నిర్వహించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకు తీసుకు వెళతానని అన్నారు. అందుకు కావాల్సిన నిధుల మంజూరుకు కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం తప్పకుండా వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన నిధుల మంజూరుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-నయీంనగర్

గాంధీభవన్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌పార్టీలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత రమేశ్ గౌడ్, 56వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రుద్రోజు మహేంద్రనాథ్, డివిజన్ బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు సిరాజ్, చిలువేరు శ్యామ్ బాబు, శ్రీనునాయక్, గడ్డం రఘుపతిలు చేరగా ఎమ్మెల్యే నాగరాజు కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు దూలం సదానందం గౌడ్, కొంకా హరిబాబు, జనుప సారంగపాని, భూక్యా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

నేను పార్టీ మారడం లేదు : ఎర్రబెల్లి



నవతెలంగాణ-తొర్రూరు

నేను పార్టీ మారడం లేదు బిఆర్ఎస్ లోనే ఉంటాను అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. మంగళవారం పత్రికల వారికి విడుదల చేసిన ఒక ప్రకటనలో తాను పార్టీ మారడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కొట్టి పారేశారు. నా పైన కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పార్టీ కోసం ఒక సైనికుడిగా పని చేస్తానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్, పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని ఇలాంటి దుష్ప్రచారం నాపై చేస్తున్నారని ఆయన అన్నారు. కొందరు చేసే దుష్ప్రచారాలని నమ్మవద్దు అని ఆయన కోరారు.

మాజీ ఎంపీ సీతారాంనాయక్‌కు సన్మానం



నవతెలంగాణ-నెల్లికుదురు

మాజీ ఎంపీ, బిజెపి పార్టీ మహబూబాద్ పార్లమెంటు అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ ఆ పార్టీ శ్రేణులు ఘనంగా శాలువాతో సత్కరించినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లని పాపారావు మండల అధ్యక్షుడు చందు రాజ్ కుమార్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని మంగళవారం మహబూబాద్ వెళ్తున్న క్రమంలో అతనిని ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, మహమ్మద్ ముస్తఫా, కోటగిరి అశోక్, పాల బిందెమహేష్, నవీన్, రాము, శీను, సుందర్, యాకిరెడ్డి, రంజిత్, కుక్కల ఐలయ్య హరీష్, లక్ష్మణ్, సుధాకర్, శివసాయి, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు



నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ సరెండర్ కమ్-రిహబిలిటేషన్ పాలసీలో భాగంగా సీపీఐ (మావోయిస్ట్) పార్టీ సభ్యురాలు షేక్ ఇమాంబీ అలియాస్ జ్యోతక్క మంగళవారం మానుకోట ఎస్పీ ముందు లొంగిపోయారు. సీపీఐ(మావోయిస్ట్) పార్టీ సిద్ధాంతాలతో ప్రభావితురాలు అయి చేరి ఇపుడు సాధారణ, ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి మహబూబాబాద్ ఎస్పీ శ్రీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఎదుట లొంగిపోయింది. ఎస్పీ తెలిపిన వీరాల ప్రకారం. ఇమాంబీ 2004లో ఆమె ఛత్తీస్‌గఢ్ సిపిఐ (మావోయిస్టు) పార్టీకి టైలరింగ్ టీమ్‌లో పని చేయడం ప్రారంభించింది. ఆమె మావోయిస్టు భావజాలంతో విసుగు చెంది మావోయిస్టు నాయకులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ఈ ప్రాంతంలోని అమాయక ప్రజలను ఉపయోగిస్తున్నారనే వాస్తవాన్ని గ్రహించి జనజీవన స్రవంతి కలిసి పోవాలని నిర్ణయించుకుని ఎస్పీ మందు లొంగిపోయింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిపిఐ (మావోయిస్టు) పార్టీ హానికరమైన భావజాలానికి వారు బలికాకూడదన్నారు. ప్రభుత్వం సరెండర్-కమ్-పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జనజీవన స్రవంతిలో చేరాలన్నారు. మావోయిస్టు భావజాలంతో భ్రమపడిన సీపీఐ (మావోయిస్ట్) పార్టీకి చెందిన యాజీ క్యాడర్ సమాజంలో శాంతియుత జీవితాన్ని గడపడానికి అన్ని రాకములుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోవాలి

నవతెలంగాణ-బయ్యారం



ప్రత్యేకమైన భాష యాస కట్టుబాట్లు సంస్కృతి కలిగిన లంబాడీలను తెలుగు రాష్ట్రాల్లో నివసిస్తున్న వారిని గుర్తించి రాజ్యాంగాన్ని సవరించి 1976 వ సంవత్సరంలో ప్రత్యేకమైన చట్టం చేసి ఎస్టీ రిజర్వేషన్ కల్పించిన ఆనాటి ప్ర ధానమంత్రి ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైనదని సేవాలాల్ సేన మండల అధ్యక్షులు గుగులోత్ విక్రం నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఇందిరా గాంధీ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలు కొండకోనల్లో నాగరికతకు దూరంగా జీవనం సాగించడానికి పరిశీలించి వారిని విద్య, వై ద్యం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని దఢమైన సంకల్పంతో లంబాడా జాతి ని అక్కున చేర్చుకొని వారికి ఎస్టీ రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. లం బాడ గిరిజన జాతికోసం అహర్నిశలు శ్రమించి నేడు గిరిజన లంబాడా, కాం గ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అయిన పోరిక బలరాం నా యక్‌ను భారీ మెజారిటీతో గెలిపించి లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఇం దిరా గాంధీ, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని, అలాగే రాహుల్ గాంధీని భావి భారత ప్రధాని చేయాలని ఆకాంక్షించారు.

ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పక్రియలో భాగంగా విభజన హామీ బయ్యారం ఉక్కు పరిశ్రమను నెలకొల్పాలని ఆనాటి యూపీఏ ప్రభుత్వం విభజన హామీలో పొందుపరచడం జరిగిందని, కానీ మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలను బయ్యారం ఉక్కు పరిశ్రమను తుంగలో తొక్కి కేవలం ఓట్ల కోసం దళిత గిరిజన సభండ వర్గాలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వాన్ని కూల్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు ఇస్లావత్ మంగీలాల్ నాయక్, ఆంగోత్ శీను నాయక్, బానోతు నగేష్ నాయక్, అజ్మీర కళ్యాణ్‌నాయక్, జర్పుల నరేష్ నాయక్, బానోత్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పదవతరగతి హిందీ పరీక్ష

నవతెలంగాణ-గార్ల

రెండవ రోజు జరిగిన పదవతరగతి లాంగ్వేజ్ హిందీ పరీక్షకు 307 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎఈవో బి.ఫూల్ చంద్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో బాలికల ఉన్నత పాఠశాలలో 157 మందికి గాను 157 మంది, ఆశ్రమ పాఠశాలలో 150 మందికి గాను 150 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై జీనత్ కుమార్ 144 సెక్షన్ అమలు చేసి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

సోషల్ మీడియా జిల్లా చైర్మన్‌గా షాహిద్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలంలోని అర్పనపల్లీ గ్రామానికి చెందిన షేక్ షాహిద్‌ను తెలంగాణా ముస్లిం హక్కుల పోరాట సమితి సోషల్ మీడియా చైర్మన్‌గా టీఎంహెచ్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజీమ్ నియమించారు. తన నియామకానికి సహకరించిన జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులకు షాహిద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో ఒకరు మృతి

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని గాజులగట్టు గ్రామానికి చెందిన కోర్ర సుక్య అకస్మాతుగా గుండెపోటుతో మంగళవారం మతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం సూక్య ఉదయం గుండెనొప్పి వస్తుందని తెలపడంతో వెంటనే గూడూరుకు తీసుకువచ్చాక అక్కడ నుండి మహబూబాబాద్ కు తరలిస్తున్న క్రమంలో మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సూక్య మతితో గాజుల గట్టు గ్రామంలో విషాదఛాయలు అమ్ములుకున్నాయి. గూడూరు మాజీ సర్పంచ్ నువ్వు నునవత్ రమేష్ పార్థివదేహానికి నివాళి అర్పించి దహన సంస్కారానికి అర్థిక సహాయంగా 3000 ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-గూడూరు

నేడు మండలంలోని రేపు అయోధ్యాపురం గ్రామంలో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అమూల్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అయోధ్యపురం గ్రామంలో ఏబి కేబుల్ డ్యామేజ్ , మిడిల్ పోల్స్, చెట్లు తొలగించడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అంగన్వాడి కేంద్రాల్లో పోషన్ పక్వాడ

నవతెలంగాణ-గూడూరు

మండలంలో మచ్చర్ల క్లస్టర్ పరిధిలో మాచర్ల గ్రామంలో ని వివిధ అంగన్వాడి కేంద్రంలో ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తిరుపతమ్మ, నాగలక్ష్మి, వివిధ అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

పురపాలికలో పన్నుల వసూళ్ల లక్ష్యం చేరేనా...?

- రూ. 1.44 కోట్ల పన్ను బకాయిలు
- ఆర్థిక సంవత్సరం మరో 11 రోజులే
- వడ్డీ రాయితీ ప్రకటనకు స్పందన అంతంతే
- కోడ్ కూయడంతో ఎన్నికల విధుల్లోకి ఉద్యోగులు



నవతెలంగాణ-తొర్రూరు

పురపాలక సంఘాల్లో అభివద్ధి నిర్వహణ ఆయా సంస్థలకు వచ్చే ఆదాయం పైనే ప్రముఖంగా ఆధారపడి ఉంటుంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పురపాలక సంఘం కు ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు కాగా ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా 80 శాతం నుండి 90 శాతం పన్నులు వసూలు చేయడం ఆనవాయితీ. కానీ ఈసారి మాత్రం వసూళ్లలో ఉద్యోగులు వెనుక పడ్డారని చెప్పుకోవాలి. మరో 11 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా ఇంకా 50 శాతం బకాయిలు మిగిలి ఉన్నట్లు సమాచారం. ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన మేర పన్నులు వసూలు చేయలేకపోతుండడం గమనార్హం.

ప్రణాళిక లోపంతో...

పురపాలక సంఘంలో గత సంవత్సరం ప్రణాళిక ఏర్పరచుకొని అధికారులు పన్నులు వసూలు చేశారు. ప్రతి ఆర్థిక సంవత్సరం జనవరి నుండి వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారిస్తూ బకాయిదారులకు నోటీసులు జారీ చేసేవారు. అయితే ఈ ఏడాది పలు కారణాలతో అధికారులు పన్నుల వసూళ్లపై శ్రద్ధ కనబరచలేదని తెలుస్తుంది. ఈ ఏడాది వ్యవధిలోనే ఇద్దరు కమిషనర్లు మారడం, గత కమిషనరు పట్టింపు లేనితనం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి బకాయిలు పెరిగిపోయాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 కోట్ల56 లక్షల 31 వేల ఇంటి పన్నులు బకాయి ఉండగా ఇప్పటివరకు రూ.1 కోటి 11 లక్షల 53 వేల వసూలయ్యాయి.

ఇంకా రూ.1కోటి 44 లక్షల 78 వేలు మార్చి 31 లోగా వసూలు చేయాల్సి ఉంది. ఇది కాకుండా ట్రేడ్ లైసెన్సులు, నల్ల పన్నులు కూడా పెద్ద మొత్తంలో బకాయిపడి ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ ఈ పన్నుల వసూళ్లపై ప్రభావం చూపుతోందని భావిస్తున్నారు.

పది రోజులే గడువు ....

పురపాలికకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం ఆస్తి పన్నుల బకాయిలపై వడ్డీ రాయితీ కల్పించింది. ఒకేసారి బకాయి చెల్లిస్తే వడ్డీల్లో 90శాతం రాయితీ ప్రకటించింది. ఈనెల 31వ తేదీ వరకు రాయితీతో పన్ను చెల్లించేందుకు అవకాశం ఉండగా ఈ అంశంపై పెద్దగా ప్రచారం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల బ్యానర్లు, ఆటోలో ప్రచారం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో బకాయిదారులకు మాత్రం సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది. మరో 10 రోజుల్లో రాయితీ గడుపుతో పాటు ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, ఈలోపు ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచకపోతే ఆశించిన మేర ఆదాయం సమకూరే అవకాశం లేదు.

ఎన్నికల ఎఫెక్ట్...

ఆస్తి పన్నుల వసూళ్లపై ఎన్నికల ప్రభావం పడే అవకాశం ఉంది. శనివారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికారులు ఉద్యోగులను ఎన్నికల విధుల్లోకి కేటాయిస్తున్నారు. అధికారులు సైతం ఎన్నికలపై దష్టి సారించాల్సి ఉంటుంది. ఇవన్నీ పన్నుల వసూళ్లపై ఇబ్బందిగా మారనున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో పన్నులు రాబట్టడంలో కోడ్ అడ్డంకిగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నూరు శాతం వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తున్నాం..

శాంతి కుమార్, కమిషనర్, పురపాలక సంఘం తొర్రూరు

తొర్రూరు పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్సులు వసూళ్లకు వార్డు ఆఫీసర్లతో, బిల్ కలెక్టర్లతో, మున్సిపల్ సిబ్బందితో కమిటీలు వేసాము. ప్రతి వార్డులో డప్పు చప్పుడితో బకాయిదారుల ఇంటి ముందుకు వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నాము. నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై పురపాలక సంఘం చట్టం ప్రకారం చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు ఒక ఫంక్షన్ హాల్, ఒక వాటర్ ప్లాంట్ సీజ్ చేశాం. బకాయి దారులు సహకరించి పన్నులు చెల్లించి పట్టణాభివద్ధికి సహకరించండి.

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



నవతెలంగాణ-మహబూబాబాద్

అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని ఎన్నికల అధికారి, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జిల్లాస్థాయిలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే ఖచ్చితంగా రశీదు ఉండాలన్నారు. రూ.10 లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఏజెన్సీలు పెద్దమొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని అన్నారు. లాకర్స్ లో గోల్డ్ ను పర్యవేక్షించి, క్యాష్ జెనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్‌లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, అద్వైత్ కుమార్ సింగ్‌లి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, ఎన్నికల విధులలో వివిధ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ల ప్రాముఖ్యత తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ రాము, తో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఎల్డీఎంఆర్.సత్యనారాయణ మూర్తి , బ్యాంకర్లు, ఎలక్షన్ సూపర్డెంట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీఓ

నవతెలంగాణ-పెద్దవంగర



ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తొర్రూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ హైమవతి, ఎంఎల్‌హెచ్‌పీ రాజ్‌కుమార్ అన్నారు. వడ్డెకొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కవితారెడ్డి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు, కిశోరబాలికలు పోషణ పక్వాడ్ పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారం లోపం తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణ కోసం ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహారం స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మురళీ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ అశోక్, ఏఎన్ఎం బూబ, అంగన్వాడీ టీచర్లు సుకన్య, అరుణ, మంజుల, రేణుక, సునీత, అండాలు, సరళ, నీలవేణి ఝాన్సీ, స్వరూప ఆశా వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తాం : కమిషనర్ శాంతికుమార్

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ పీ.శాంతికుమార్ అన్నారు. మంగళవారం తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాలేరు రిజర్వాయర్ యందు వాటర్ స్టోరేజ్ లేనందున మిషన్‌భగీరథ వాటర్ తొర్రూర్ పట్టణానికి తగినంతగా ఇవ్వలేక పోతున్నామని, మాదిరిపురం ఫిల్టర్ బెడ్ అధికారులు తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. అట్టి సూచనల ప్రకారం తొర్రూర్ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కు పట్టణంలో గల మంచినీళ్ల బావిని, చర్ల బావిని శుభ్రపరిచి రిపేరు చేయించి తొర్రూర్ పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా చూడవలసిందిగా ఆదేశించినారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రెండు బావిలను శుభ్రం, మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు. ఈ రెండు భావిలో వాటర్ టెస్ట్ కు గాను మాదిరిపురం ఫిల్టర్ బెడ్ ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు.

అక్కడి అధికారులు వాటర్ టెస్టింగ్ చేసి రిపోర్టు సమర్పించడం జరిగిందని, రిపోర్టులో ఈ బావిలో నీటిను కాచిచల్లార్చిన తర్వాతనే తాగాలని సూచించారని పట్టణ ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని వధా చేయరాదని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్, వాటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-ఇనుగుర్తి

ఇటీవల చతిస్గఢ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహ మ్మద్ షబ్బీర్ కుటుంబానికి తన పదవ తరగతి స్నేహితులు 30 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, వెంకటేష్ ,శ్రీకాంత్, భాను, ప్రకాష్, వినోద్, అశోక్, శ్రీను, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ-మహబూబాబాద్

పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను మంగళవారం మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాంటిసేరి హై స్కూల్, చైతన్య టెక్ స్కూల్ లో పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దష్టి పెట్టాలని, సెక్షన్ 144 అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం చేయరాదని, పరీక్షా కేంద్రం పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. ముఖ్యంగా సిసి కెమెరాల పనితీరుపై సంబంధిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎస్పీ తెలిపారు.

నెల్లికుదురు : రెండవ రోజు ఇంగ్లీషు పరీక్ష పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు ప్రశాంతంగా నిర్వహించుకున్నారని టీఎస్ ఎం ఎస్ సి ఎస్ రవి గౌడ్ హై స్కూల్ సిఎస్ శ్రీనుబాబు తెలిపారు మంగళవారం ఇంగ్లీషు పరీక్షను రాసుకునేందుకు విద్యార్థులు గౌట్ హైస్కూల్లో 190 మందికి 189 మంది హాజరయ్యారని అందులో ఒకరు కి మినహాయింపు పొంది ఉండడం జరిగిందని ఆ పాఠశాల సిఎస్ శ్రీను బాబు తెలిపాడు మరియు టి ఎస్ ఎం ఎస్ పాఠశాలలో 212 మందికి 209 మంది హాజరయ్యారని అన్నారు విద్యార్థులు ఎలా రాస్తున్నారని స్క్వాడ్ పరిశీలించడం జరిగిందని తెలిపారు.

పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం



నవతెలంగాణ-నెల్లికుదురు

రజాకార్లను ఎదురించి సాయుధ గెరిల్లా పోరాటాలకు నాయకత్వం వహించిన పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం పార్టీ మహబూబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న పేర్కొన్నారు. కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సభను మండల కేంద్రంలో పెరుమాండ్ల బాబు గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకార్ల భూస్వాముల ఆకత్యాలు, వెట్టిచాకిరి, దొర నీ బాంచన్ కాల్మొక్త దోపిడి పీడనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ గెరిల్లా తెలంగాణ పోరాటాలకు నాయకత్వం వహించి వారి విముక్తి కోసం అహర్నిశలు కషిచేసిన ధీరవనిత అన్నారు. దొరలను రజాకార్లను తరిమికొట్టి దున్నేవాడికి భూమి కావాలంటూ లక్షలాది ఎకరాల భూస్వాముల కబంధహస్తాలలో ఉన్న భూములను పంచిన యోధురాలు మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తిని తీసుకొని ఇప్పటికీ దోపిడీ పీడనకు గురి అవుతున్న కార్మిక కర్షక విద్యార్థి యువజ నులకు అండగా నిలిచి ఉద్యమాలు చేపట్టడమే ఆమెకు నీ నిజమైన నివాళులన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్‌బాబు, మంగ్యా నాయక్, సత్యనారాయణ, బిక్షపతి, తోట నరసయ్య ఏకాంతం, బాణాల యాకన్న తోట శీను, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే సహించేది లేదు



నవతెలంగాణ-నెల్లికుదురు

గ్రామాలు, తండాల్లో గుడుంబా తయారుచేసినా అమ్మినా సహించేది లేదని ఎక్సైజ్ ఎస్సై రవళీ హెచ్చరించినట్లు తెలిపారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామ శివారులో మంగళవారం గుడుంబాను ఒక ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 10 లీటర్ల సారాను పట్టుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఉమ్మడి ఎర్రబెల్లి గూడెం గ్రామంలో పరిధిలోని బాడువాతండాకు చెందిన ఆలు అనే వ్యక్తి10 లీటర్ల నాటు సారాను ఒక ద్విచక్ర వాహనం పై తీసుకెళ్తున్న క్రమంలో 10 లీటర్ల నాటు సారాను స్వాధీనపరచుకొని ద్విచక్ర వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా సారాయి తయారుచేసిన అమ్మిన వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. నిబంధనలో అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఊరుకునేది లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్‌కుమార్, సత్యప్రసాద్, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టాలి

నవతెలంగాణ-గార్ల



గార్ల పట్టణ కేంద్రం లో వివిధ ప్రాంతాలలో డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్త పూడికతీ త పనులు చేపట్టాలని స్థానికు లు పంచాయతీ అధికారులను కోరుతున్నారు. స్థానిక నెహ్రూ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకస్థూపం వెనుక ఉన్న డ్రెయినేజీలో నిల్వ ఉన్న చెత్త వలన దుర్గంధం వ్యాపింపజేస్తుందని దాని వలన స్థానికులు, ఆటో సెంటర్ లో డ్రైవర్ లు,ప్రయాణికులు ఇబ్బం దులు పడుతున్నారని డ్రెయినేజీ ని చూపిస్తూ మంగళవారం స్థానికులు నిర సన వ్యక్తం చేశారు. పట్టణం లోని నిర్మలా స్కూల్ ఎదురుగా కాలువ,మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలో డ్రెయినేజీ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి అంటువ్యాధులు ప్రబల కుండ ముందుస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో మైసా అశోక్,యం.రామకృష్ణ, బాదం రాజేష్, రవి, కుమార్ తదితరులు ఉన్నారు.

ఇందిరకు ఎంపీ అభ్యర్థిగా అవకాశమివ్వాలి

నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్



నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరకు ఎంపీ అభ్యర్థిగా అవకాశమివ్వాలని, భారీ మెజార్టీతో గెలిపించి, అధినాయకత్వానికి బహుమతిగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శాగంటి మణి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్లతో ఓడిందని అయినా, నియోజక వర్గ ప్రజల, పార్టీ శ్రేణుల అభ్యున్నతి కోసం తమ నాయకురాలు ఇందిర అహర్నిశలూ కృషి చేస్తున్నదని అన్నారు. తప్పకుండా ఈ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఇందిరమ్మకు అవకాశం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాజు, శేఖర్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై శ్వేత

నవతెలంగాణ - తరిగొప్పుల



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అయ్యల శ్వేత అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం కళాజాత నిర్వహించారు. సామాజిక దురాచారాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు తదితర అంశాల పట్ల పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రాచీన కాలంలో భౌతికంగా దాడులు చేసి దొంగతనాలకు పాల్పడేవారని, ప్రస్తుత తరుణంలో బాగా చదువుకున్నవాళ్లు టెక్నాలజీని ఉపయోగించి నేరాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. గ్రామ గ్రామాన ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ నాయక్, టీం లీడర్ తిప్పర్తి శ్రీనివాసులు, కళాకారులు గద్దర్ సాంబయ్య, గడిపే బాలయ్య, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్ కుమార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్ఓ రోహిత్ సింగ్

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణలో మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సెక్టార్ పోలింగ్, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధి పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్ఓ, రోహిత్‌సింగ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన నివేదికను ఏఆర్ఓకు సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్ సింగ్



మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం లోని 294 పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల వివరాలను అందించాలన్నారు. పార్లమెంటు ఎన్నికలకు 85 సంవత్సరాల వయసు వారికే పోస్టల్ ఓటింగ్ అవకాశం కల్పించిందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఏప్రిల్ 20 వరకు అవకాశం ఉందని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం 6మండలాల్లో 36 సెక్టార్లను ఏర్పాటు చేసి 36 మంది సెక్టార్ పోలింగ్, పోలీస్ అధికారులను నియమించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాల తహసీల్దార్లు తీరందాస్ వెంకటేశం, సిహెచ్ అంజయ్య, హుస్సేన్, శ్రీనివాస్, మహేందర్, వినోద్ కుమార్, ఎన్నికల డిటి రామారావు, సెక్టార్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలు గుర్తించాలి : జిల్లా కలెక్టర్



నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్‌తో కలిసి జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. రూ.50వేల నుంచి రూ.10లక్షల మధ్య లావాదేవీలు జరిగితే రసీదు ఉండాలన్నారు. ఆపై లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో దాదాపుగా 86 ఏటీఎంలు ఉన్నాయని, వాటిల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఎలాంటి ఉల్లంఘనలు, సంఘటనలు చోటు చేసుకున్నా సి-విజిల్ యాప్ లో రిపోర్ట్ చేయాలని సూచించారు. పబ్లిక్ అండ్ ప్రైవేట్ స్థలాల్లో సమావేశాలు నిర్వహించాలనన్నా, గోడలపై రాతలు రాయాలనన్నా, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లు తదితర అంశాలపై సువిధా పోర్టల లో అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఏప్రిల్ 15 వరకు ఫార్మ్-6 లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 85 ఏండ్ల వారు 12డి ఫార్మ్ లో ఆర్డీఓ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వారికి ఇంటి నుంచి ఓటు వేసేందుకు అవకాశం లభిస్తుందని చెప్పారు. అనంతరం జిల్లాలోని ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల పోస్టర్లు, పాంప్లెట్, ఫ్లెక్సీలు, యాడ్‌లు, పేరు, అడ్రస్ లేకుండా ప్రింట్ చేయకూడదని, లౌడ్ స్పీకర్లు, రోడ్డు షోలపై అనుమతి పొందాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలను వ్యతిరేకిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఎల్డీఎం శ్రీధర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, పార్టీల ప్రతినిధులు, బ్యాంకర్లు, ప్రింటర్ యజమానులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - రఘునాథపల్లి

మండల పరిధి ఖిలాషాపూర్ సెక్షన్‌లో మంగళవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించటానికి సిబ్బందికి, అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. పలు సమస్యల పై ఎస్ఈ వేణుమాధవ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో జనగామ డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ప్రారంభం



నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండలం రామచంద్రాపురం గ్రామ రైతు వేదికలో మంగళవారం వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్ప్ ఆఫ్ హ్యాండ్ సౌజన్యంతో మల్టీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఊపిరి తిత్తులు, గుండె, శ్వాస సంబంధిత వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రేలు తీసారు. బీపీ, షుగర్, జనరల్ దంత, కంటి,రక్త పరీక్షలు నిర్వహించారు. ఎస్ఐ సతీష్, కిసాన్ కోఆర్డినేటర్ నేడిగొండ శ్రీనివాసు హాజరై మాట్లాడారు. ఫౌండేషన్ వారు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, నూకల నర్సిరెడ్డి, దునుకు వెలాద్రి, ఆముదాల మల్లారెడ్డి, ఆముదాల భూపాల్ రెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, ఇంద్రారెడ్డి, ఉప్పలపాటి హేమంత్, డాక్టర్ కెన్నెడీ, జయరాజ్ గౌరవ సలహాదారు వేలాద్రి పాల్గొన్నారు.

రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు లోపించాయి

నిబద్ధత గల కమ్యునిస్టు తీగారం నర్సయ్య : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నవతెలంగాణ - స్టేషన్ ఘనపూర్

ప్రస్తుత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు లోపించాయని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సీనియర్ నాయకులు ఎన్నకూస రాంనర్సయ్య తండ్రి ఎన్నకూస(తీగారం) నర్సయ్య ఇటీవల మరణించగా మంగళవారం బాధిత కుటుంబాన్ని



కడియం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి వరకు కమ్యునిస్టు పార్టీ నాయకుడిగా, నిబద్ధత, పార్టీ సిద్ధాంతాలు, పాటిస్తూ, ఈ ప్రాంత అమరజీవి మంతెన నారాయణ రెడ్డి అడుగుజాడల్లో నడిచిన గొప్ప నాయకుడు నర్సన్న అన్నారు. 1947లో జన్మించి, నాటి భూస్వామ్య విధానం వ్యతిరేకంగా, రజాకార్ల పోరులో అలు పెరుగని పోరాట పటిమ కలిగిన నాయకుడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు బెలిదె వెంకన్న, ఎంపిటిసి గన్ను నర్సింహులు, నాయకులు తోట వెంకన్న, పల్లె రవి, చట్ల యాకయ్య, మంథపురం ఎల్లాగౌడ్, ఎలిషన్, ఫాతి కుమార్, గట్టయ్య, అజయ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, షాబొద్దీన్, కొంరెల్లి, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-జనగామ











తెలంగాణ రైతాంగ సాయుధ యోధురాలు ఉద్యమాల హరివిల్లు మల్లు స్వరాజ్యం అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు, యాదగిరి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. దున్నేవారికి భూమి కావాలని, నైజాం నవాబు గద్దె దిగాలని సాగిన పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఉద్యమం అన్నారు. సాయుధ పోరాట ఫలితంగా మూడువేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని అన్నారు. 4000 మంది కమ్యూనిస్టులు వీరమరణం పొందారని, వందల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడిం దన్నారు. రెండు పర్యాలు ఎమ్మెల్యేగా గెలిచి నిత్యం ప్రజల కోసం గల మెత్తరన్నారు అన్నారు. ఆమె జీవిత విధానం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బొట్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బాల్నె వెంకట మల్లయ్య, సురేష్ నాయక్, ఎండి మైవెల్లి, కొండ వరలక్ష్మి, అంజమ్మ, యాదలక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి రూరల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఉద్యమాల హరివిల్లు మల్లు స్వరాజ్యం అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల నాయకులు సోమసత్యం అన్నారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వామ్య వర్గంలో పుట్టి పీడిత వర్గాల కోసం తుది శ్వాస వరకు పనిచేసిన వీరవనిత అని కొనియాడారు. సీపీఐ(ఎం) నాయకులు మాసంపల్లి నాగయ్య, సీఐటీయూ నాయకులు ఏనుగతల వెంకన్న, దండిగా పెద్దపురం, రాచర్ల రాజు, మైబు, అబ్బాస్, ఉప్పలయ్య, సారయ్య మంజుల తదితరులు పాల్గొన్నారు

ఇండ్లస్థలాలు సాధించుకోవాలి : ఐద్వా

బచ్చన్నపేట : ఐద్వా జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బచ్చన్నపేట భూ పోరాట కేంద్రంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ మండల నాయకులు చంద్రకళ అధ్యక్షతన జరిగింది. ఈ సదర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇర్రి అహల్య పాల్గొని మాట్లాడారు. మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో ఇండ్ల స్థలాలు సాధజంచుకోవాలని పిలుపునిచ్చారు. పోరా డి సాధించుకున్న హక్కులు, చట్టాలను నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. నేటికీ పేదలకు ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతూ మహిళలు పోరాటాలు చేస్తుంటే పోలీసులతో దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములు ప్రజా ప్రతినిధులు, భూస్వాములు ఆక్రమించుకున్న పట్టించుకోని పోలీసులు నిరుపేదలు గజం జాగ కోసం గుడిసెలు వేసుకుంటే కేసులుపెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పేదల గుడిసెలకు పట్టాలి ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. జిల్లా కమిటీ సభ్యులు చీర రజిత, కొండా వరలక్ష్మి, మండల కమిటీ సభ్యులు టి వెంకట్, శోభ, బుచ్చమ్మ, పద్మ, పుష్ప, లక్ష్మి, మల్లమ్మ పాల్గొన్నారు.

జఫర్‌గడ్ : మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రకటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షబానా హాజరై మాట్లాడారు. మల్లు స్వరాజ్యం జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శనీయమని అన్నారు. పాఠ్యపుస్తకాలలో మల్లు స్వరాజ్యం జీవిత చరిత్రను చేర్చాలని అన్నారు. శాఖ కార్యదర్శి రాపర్తి రజిత, ఉప్పునూతల ఎల్లమ్మ , యశోద, గుర్రపు శశి, సంధ్య, రాపర్తి యాక లక్ష్మి , హైమావతి ,కోమల, తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దాం

రఘునాథపల్లి : మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాల యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. మండల కమిటీ సభ్యులు కడారి ఆంజనేయులు, సాగ సాంబరాజు, కడారి యాదగిరి, ఎండి భాష, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-భూపాలపల్లి

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో జరిగిన మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సభకు నాయకులు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం రజాకార్లను తరిమికొట్టిన వీరవనిత విప్లవ ధృవతార మల్లు స్వరాజ్యం అన్నారు. చిన్నతనంలో కమ్యూనిష్టు భావాలు అలవర్చుకొని దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారన్నారు. కూలిరేట్ల ఉద్యమంతో ప్రారంభమైన ఆమె విప్లవ జీవితం 8 దశాబ్దాల పాటు వెనుదిరగలేదరాంరకె, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి(బియన్) అడుగు జాడల్లో పోరాటాల్లోకి వచ్చిన స్వరాజ్యం ఏనాడు మడమ తిప్పలేదన్నారు. పోరాటమే ఆయుధంగా గెరిల్లా దళాల్లో చేరి దొరల



దుర్మార్గాలను ఎదుర్కొంటూ నైజాం రజాకార్ల పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగించాలని కోరారు. నాయకులు ఏ శ్రీధర్, ఎండి పెద్ద రజాక్, మహేందర్, శేఖర్, ప్రీతి, లక్ష్మి, రజిని, తదితరులు పాల్గొన్నారు

పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు : కాంగ్రెస్

నవతెలంగాణ-కొడకండ్ల

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి నూనెముంతల సోమనరసయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి పని చేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. మండల కాంగ్రెస్



అధ్యక్షునిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీకి విధేయులుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్ పట్టణ అధ్యక్షులు మసురం రవీందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ధర్మారపు బిక్షపతి, మండల ఉపాధ్యక్షుడు మురారిశెట్టి అంజయ్య, మైనారిటీ మండల అధ్యక్షులు ఖలీమ్ భాయ్, దేవస్థాన కమిటీ డైరెక్టర్ రాజు, ఆయా గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా యాక్షన్ ప్లాన్ రూపొందించాలి : జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వేసవి దృష్ట్యా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, ప్రతి బుధవారం గ్రామ పంచాయతీ సెక్రటరీ తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్‌తో కలిసి ఎంపిడివోలు, ఎంపీవోలతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈజీఎస్ లేబర్ వర్క్‌పై రూ.200 సగటు రేటును నిర్ణయిం చాలని ఆదేశించారు. పది రోజుల్లో ఈజీఎస్ పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి ఎంపిడిఓలు, ఎంపివోలు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాను పరిశుభ్రతలో ముందంజలో నిలపాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పనులను ఎంపీఓలు పర్యవేక్షించాలని, పూడికలు తీయించి, బావులు పరిశుభ్రంగా ఉంచా లన్నారు. నిరంతరం తాగునీటి సరఫరా అందించాలని, మరమ్మతులు ఉంటే చేపట్టాలన్నారు. పెండింగ్ 1127 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని అన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల్లో పిచ్చి మొక్కలను తీయించాలన్నారు. ఈ నెల 26 లోపు నివేదికలు ఇవ్వాలని తెలిపారు. 24 వరకు 100 శాతం పన్నుల వసూళ్లు పూర్తవ్వాలని ఆదేశించారు. షాపులు, హోటళ్ళు, రెస్టారెంట్ ల యజమానులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుంటే షాపులను మూసివేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు చేయాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం రూ. 25,000 వరకు టెండర్లు లేకుండా సంఘాలతో అందిస్తామని, రూ. 25,000 నుంచి లక్ష వరకు ఎంపిడిఓలు ఆమోదించవచ్చని తెలిపారు. అనంతరం పోషణ్ పక్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిపిఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డీడబ్ల్యూఓ జయంతి, డీఆర్డీవో మొగులప్ప, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్ట్

ఆటోలు, బైకులను స్వాధీనం

నవతెలంగాణ-జనగామ

జనగామలో ఆటోలు, బైకుల చోరీకి పాల్పడుతున్న నలుగురు దొంగలను పట్టుకుని అరెస్టు చేసి ఆటోలు, బైకులు స్వాధీనం చేసుకున్నట్టు జనగామ పోలీసులు తెలిపారు. మంగళవారం పెంబర్తి సమీపంలో వై జంక్షన్ వద్ద కింగ్స్ వే దాబా వెనక గోతితవ్వి దాచిపెట్టిన ఆటోను వెలికితీస్తుండగా హైదరాబాద్‌కు చెందిన నలుగురు దొంగలను పట్టుకున్నారు. అరెస్టు అయిన వారిలో హైదరాబాదు లంగర్‌హౌస్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్, ఫలక్నామాకు చెందిన ఫిరోజ్ అలీ ఖాన్, రాజేందర్ నగర్‌కు చెందిన ఎండి అజారుద్దీన్, ఎండి బాబర్ ఉన్నారు. వారి నుండి రెండు బజాజ్ ఆటోలు, రెండు మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకు న్నారు. గత రెండు రోజుల క్రితం జనగామ బస్టాండ్ సమీప పక్కా వీధిలో దొంగలించిన ఆటోను హైదరాబాదు రోడ్డు పెంబర్తి సమీపంలోని కింగ్స్ వే దాబా వెనకాల గొయ్యి తీసి దాచిపెట్టి హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు. తిరిగి మంగళవారం అదే ప్రదేశానికి వచ్చి గొయ్యి నుండి ఆటోను వెలికితీస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. గత వారం రోజుల క్రితం మరో ఆటోను దొంగలించినట్లు స్థానిక సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై భరత్ ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుల్ కరుణాకర్ ఉన్నారు.

10 పరీక్షకు 99.91శాతం విద్యార్థుల హాజరు

నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం జరిగిన 10వ తరగతి (ద్వితీయ భాష) పరీక్షకు 99.91శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము ప్రకటనలో తెలిపారు. మొత్తం 6698 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 6గురు గైర్హాజరయ్యారని, 6692 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ జనగామలోని సాంఘిక సంక్షేమ గ్రూపుల పాఠశాలలో, ధర్మకంచలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి భాయ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు ధర్మకంచ పరీక్షా కేంద్రాల్లో, సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారన్నారు. అలాగే 16 పరీక్ష కేంద్రాలను ప్రత్యేక తనిఖీ బృందాలు, విద్యాశాఖ జిల్లా అధికారిగా తాను 31 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న 'పోషణ్ పక్వాడ'

నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధి హామీ పనులకు వెళ్ళిన కూలీలకు, వ్యవసాయ కూలీలకు పోషకాహార పై అవగాహన కల్పించారు. సీజన్ వారీగా పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు ఆకు కూరలు తీసుకుంటే ఆరోగ్యం పుష్టిగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ మునిగాల రాణి, ప్రభ, చింత స్వరూప, గాదె సునీత, మారెడుపాక రాణి, మాధవి, సరోజన, లలిత, లిఖిత భవాని, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి : అంగన్‌వాడీలు

నవతెలంగాణ - తరిగొప్పుల

పోషకాలు కలిగిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని అంగన్‌వాడీలు అన్నారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అక్కరాజుపల్లి, బంజారు పల్లి, అబ్దుల్ నాగారం, బొంతగట్టు నాగారం, నర్సాపూర్ గ్రామాలలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం సందర్భంగా అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. తొమ్మిది నెలలు నిండిన గర్భిణీలకు ముర్రుపాల ఆవశ్యకత తెలిపారు. అనంతరం బాలామృతం వల్ల కలిగే లాభాలను వివరించారు. పల్లె దవాఖాన డాక్టర్ శ్రీవాణీ, అంగన్వాడి టీచర్స్ రజిత, రమ, అంజమ్మ,రేణుక,మంజుల,లక్ష్మి, భాగ్యలక్ష్మి, పుష్పలత, ఆయాలు రజిత, రేణుక, సుజాత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - స్టేషన్ ఘనపూర్

మండలంలోని చాగల్ గ్రామంలో గాండ్ల నాగమ్మ (64) మృతిచెందింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల సారంగపాణి పరామర్శించారు. మాజీ ఉప సర్పంచ్ సత్తు రవి, బిఆర్ఎస్ శాఖ అధ్యక్షులు చేపూరి ప్రభాకర్, నాయకులు లక్ష్మీనారాయణ, కడియం సోషల్ మీడియా ఇన్చార్జ్ భాస్కుల సమ్మయ్య, గ్రామ యూత్ అధ్యక్షులు పొన్న రాజేష్, నాయకులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు

నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

చిల్పూర్ మండలం బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం బ్రహ్మోత్సవాల పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవ రెడ్డి, కమిటీ సభ్యులు అర్చకులు బి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



పదవతరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. 210 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 209 హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3547 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఓ రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా రంగానికి నాటక రంగమే తొలి మెట్టు

నవతెలంగాణ-ఏటూర్‌నాగారం ఐటీడీఏ



సినిమా రంగానికి నాటక రంగమే తొలి మెట్టు అని క్రియేటివ్ థియేటర్ (హైదరాబాద్), ఫౌండర్, డైరెక్టర్ అజయ్ మంకేనపల్లి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన గురుకుల కళాశాల(బాలికలు)లో జరుగుతున్న సమ్మర్ క్రీ-2024ను ఆయన సందర్శించిన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్రియేటివ్ థియేటర్, సంస్థ లక్ష్యాలు, చేస్తున్న సేవలు, సంస్థ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. థియేటర్ ఆర్ట్స్ క్యాంప్ ట్రైనర్ హరీష్ పాలకుర్తి, సుమన్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సమన్వయ కర్తలు మల్లేష్, సాయి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర మరియు ఇతర బోధన సిబ్బంది పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు...



చిట్యాల మండలం చలివాగులో నీటి కోసం బావుల తవ్వకాలు

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వేసవికి ముందే జలం పాతాళానికి పడిపోతుండడం ప్రజలు, రైతులను కలవరపెడుతున్నది. యాసంగి పంటలతో పాటు తాగునీటికి తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం ఆవరేజ్‌గా 7.59 మీటర్ల లోతు ల్లోకి భూగర్భ నీటి మట్టం పడిపోయింది. భూపాలపల్లి, మల్హర్ మండలాల్లో భారీగా అడుగంటి పోయాయి. గత ఫిబ్రవరి, గడిచిన ఫిబ్రవరితో పోలిస్తే 7.59 లోతుల్లోకి నీటి మట్టం పడిపోయింది. భూపాలపల్లి, గణపురం, మల్హర్ మండలాల్లో బొగ్గు గనుల ప్రభావం కనిపిస్తున్నది. ఇక్కడ జలం రోజు రోజుకూ హరించుకుపోతున్నది. ఎండలు ముదిరితే నీటి కష్టాలు ఎక్కువ అవుతాయని భూగర్భ జలశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొంచి ఉన్న నీటి ఇబ్బందులు...


భూగర్భ జల శాఖ అధికారులు ప్యూజోమీటర్ ఆధారంగా విడుదల చేసిన నివేదికలు చూస్తే రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు తప్పేటట్లు లేవు. గత (2023) ఫిబ్రవరిలో 6.96 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ఈ ఫిబ్రవరిలో (2024)లో 7.59 మీటర్లకు పడి పోయింది. భూపాలపల్లి మండలంలో గత ఫిబ్రవరిలో 5.79 మీటర్ల లోతులో ఉన్న జలం ఈ ఫిబ్రవరిలో 6.83 మీటర్లకు, మల్హర్ మండలంలో గత సంవత్సరం ఫిబ్రవరిలో 8,92 మీటర్లు ఉండ గా ఈ ఫిబ్రవరిలో 8.61 మీటర్లకు అడుగంటింది. గణపురం మండలంలోనూ 6.53 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ఇప్పుడు 6.83 మీటర్ల లోతుకు చేరింది. ఈ మూడు మండలాల్లోనూ బొగ్గు వెలికి తీత కార్యకలాపాలు కొనసాగడం వల్ల ఎక్కువగా జలాలు అడుగంటినట్లు తెలుస్తున్నది.

సాగుపై రైతుల తీవ్ర ఆందోళన...

గత యాసంగిలో జిల్లాలో 1,05,625 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగగా ఈ యాసంగిలో 1,13,452 ఎకరాల్లో సాగు లో ఉన్నాయని అధికారులు తెలిపారు. రైతుబంధు పూర్తి స్థాయిలో అందకపోవడం, పంటలకు నీరు సక్రమంగా అందే అవకాశం లేకపోవడంతో పంట మధ్యలో ఉండడంతో జిల్లాలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మండలాల వారీగా...

	గత ఫిబ్రవరి	ఈ ఫిబ్రవరి
1.భూపాలపల్లి	5.79మీ.	6.83మీ.
2. చిట్యాల	4.68మీ.	4.77మీ.
3. గణపురం	6.53మీ.	6.83మీ.
4. గోరి కొత్తపల్లి	4.59మీ.	5.47మీ.
5. కాటారం	18.82మీ.	18.53మీ.
6. మహదేవపూర్	11.67మీ.	12.67మీ.
7. మహా ముత్తారం	4.00మీ.	4.61మీ.
8.మలహర్ రావు	7.28మీ.	8.61మీ.
9. మొగుళ్లపల్లి	4.10మీ.	5.52మీ.
10. పలిమెల	8.38మీ.	8.22మీ.
11. రేగొండ	4.30	4.56మీ.
12. టేకుమట్ల	3.36మీ.	4.42మీ.


మొగుళ్లపల్లి మండలంలో నీరందక ఎండిపోయిన పంట చేను

ఘనంగా బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ 13వ వార్షికోత్సవం



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలో పెద్దతూండ్ల గ్రామంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం అంగరంగావైభవంగా 13వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్స్‌పాల్ వాల శశిధర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారుల నృత్యాలు పలువురిని అలరించాయి. ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ ప్రోత్సహిస్తున్న కరస్పాండెంట్ శశిధర్‌రావును అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. అనంతరం హాజరైన ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు,వివిధ రాజకీయ నాయకులను,సామాజిక కార్యకర్తలను సన్మానించి, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దతూండ్ల మాజీ సర్పంచ్ ఇనుగంటి విజయ నాగేశ్వర్ రావు, మాజీ జెడ్పిటిసి గోనె శ్రీనివాసరావు, మాజీ వార్డు సభ్యులు, జర్నలిస్టులు,రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో నలుగురు డిబార్

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంగళవారం హిందీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన రెండో రోజే నలుగురు డిబార్ కావడంపై సర్వాత్ర చర్చ నియాంశంగా మారింది. ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న హిందీ పరీక్షలో నలుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండటంతో అధికారులు గుర్తించి డిబార్ చేశారు. డిబార్ అయిన విద్యార్థుల్లో బసవరాజుపల్లి గ్రామంలోని నేతాజీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మండల కేంద్రంలోని శ్రీ నారాయణ పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థి, కొండాపురం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థి డిబార్ అయ్యారు.

బాలికలకు ఏఎమ్మార్ ఉచిత బస్సు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని మల్లారం, దుబ్బపేట గ్రామాల పరిధిలో ఉన్న కాస్తూబా గాంధీ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న బాలికలకు ఉచితంగా బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లుగా ఏఎమ్మార్ పిఆర్ఓ మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్ఓ మాట్లాడారు. బాలికలు మండల కేంద్రమైన తాడిచెర్లలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడంతో బాలికలకు దూరబారం ఉండడమే కాకుండా రవాణ సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయుల వినతి మేరకు ఏఎమ్మార్ హెడ్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



కార్ ఓనర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ గార్డెన్ లో మంగళవారం సమ్మక్క సారక్క కారు ఓనర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మేకల సంజీవ ఆధ్వర్యంలో సమావేశం ని ర్వహించి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడ ిగా బాదం ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఇన్సూ రెన్స్, ఫిట్నెస్ డ్రైవింగ్ లైసెన్స్ సంబంధిత సమస్యలు ఉంటే తన దృష్టి కి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్, ప్రధాన కార్యదర్శి లోకు రాజేష్, కార్యదర్శి ఉప్పుల రాజు, జాయింట్ సెక్రెటరీ మాట్లా బద్రి, ముఖ్య సలహాదారులు అప్రోజ్ ఖాన్, మీడియా ఇన్చార్జ్ గుగ్గిళ్ళ సుజన్, కమిటీ సభ్యులు, బండ సురేష్, రమేష్, కోమల్ రెడ్డి, అజ్మీరా రామ్ సింగ్, అజ్మీర కిషోర్ నాయక్, రాజేందర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం.. సెగ్రి గేషన్ షెడ్ల ప్రక్షాళన

నవతెలంగాణ-మంగపేట





'ఆగమాగం... అస్తవ్యస్తం' అనే శీర్షికన మంగళవారం నవతెలంగాణ దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. అదే రోజు అధికారుల నుంచి విశేషమైన స్పందన లభించింది. స్థానిక ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఎంపీఓ మమత స్పందించి హుటాహుటిన దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సెగ్రి గేషన్ షెడ్లను ప్రక్షాళన చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇదే తడవుగా కార్యదర్శులు దగ్గరుండి పంచాయతీ సిబ్బంది చేత సెగ్రి గేషన్ షడ్లను వాటి పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. మండలంలోని బోర్ నర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట తదితర గ్రామాలలో ఈ ప్రక్షాళన కార్యక్రమం కొనసాగింది.

సక్రమ నిర్వహణకు చర్యలు..: ఎంపీడీఓ

గ్రామ పంచాయతీలు సెగ్రిగేషన్ షెడ్లను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాంమని ఎంపీడీఓ కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం సెగ్రిగేషన్ షెడ్ల ప్రక్షాళన చేపట్టామన్నారు. ఒకటి రెండు రోజుల్లో మండలంలోని అన్ని షెడ్లను శుభ్రపరచి పునరుద్ధరిస్తామని తెలిపారు. షెడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బహిర్భూమిగా మారిన తమ గ్రామ స్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్ల గురించి ప్రచురించిన నవ తెలంగాణ పత్రికకు, తక్షణం స్పందించి ప్రక్షాళన చేయించిన ఎంపీడీఓకు చేరుపల్లి గ్రామస్థులు, ఆ గ్రామ యువజన నాయకుడు ముత్తెబోయిన ఆది నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి సరిహద్దు ప్రాంతంలో పోలీసుల అప్రమత్తం

నవతెలంగాణ-మహదేవపూర్



మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయవం విధితమే. మృతిచెందిన వారు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు కావడంతో భూపాలపల్లి జిల్లా ఎస్పీ, కాటారం డీఎస్పీ రామ్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మహాదేవపూర్ సీఐ రాజేశ్వరావు, మహాదేవపూర్, కాళేశ్వరం పలిమల ఎస్సైలు కె ప్రసాద్, భవాని సేన, థామస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరం అంతరాష్ట్ర బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్రిడ్జి వద్ద, పలిమెల మండలంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. గోదావరి సరిహద్దు ప్రాంతంలో తెలంగాణ పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టులు గోదావరి దాటి తెలంగాణ ప్రాంతానికి వస్తారన్న అనుమానంత తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. గోదావరి సరిహద్దులో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు.అలాగే బీరసాగర్ గ్రామంలో స్థానిక ప్రజలతో సీఐ రాజేశ్వరరావు, ఎస్సై భవానీసేన్ సమావేశ మయ్యారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమా చారం ఇవ్వాలని, ఎవరికీ ఆశ్రయం కల్పించొద్దని సూచించారు. గోదావరి తీర ప్రాంతాల్లో కూంబింగ్ విస్తృతం చేశారు. వారి వెంట పోలీసులు ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్ద పీట : ఎమ్మెల్యే

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



ముదిరాజుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేనని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముదిరాజ్ మహాసభ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యనారాయణ రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ఎస్సీల తర్వాత ఉన్న అతిపెద్ద కులం ముదిరాజ్‌లు అన్నారు. వారు రాజకీయంగా, ఆర్థికంగా విద్య పరంగా వెనుకబడి ఉన్నారని, అర్హత కలిగిన ప్రతి ఒక్క పేద ముదిరాజుకు ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం కులాల పేరు తోని రాజకీయాలు చేశారని, ఓట్ల కోసం కులాలుగా మతాలుగా విభజించి పాలించారని మండిపడ్డారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుండి బీసీఏకు మార్చే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. చెరువులను గత ప్రభుత్వాలు బినామీ కాంట్రాక్టర్ పేరుతో చెరువులో చేపలు పట్టకుండా రాజకీయాలు చేశారని. బినామీ కాంట్రాక్టర్లపై ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు. కాంట్రాక్టర్ చేతుల్లో చెరువులు పెట్టరాదని సంఘం పేరుతో రాజకీయాలు చేసే పద్ధతులు మానుకోవాలని అన్నారు. గతంలో నియోజకవర్గంలో 124 చెరువులు అధిక వర్షాలతో తెగిపోయాయని వాటికి శాశ్వత మరమ్మతులు చేస్తామని చెరువుల మరమ్మత్తుల కోసం ప్రభుత్వం నుండి బడ్జెట్ కేటాయించి త్వరలోనే అన్ని చెరువులను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ముదిరాజ్ సంఘం జిల్లా మహాసభ నాయకులు తోట గట్టయ్య, చిలుకల సారంగ పాణి, చింతల రమేష్, పుష్పలత, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ప్లాంట్‌లను ఎంపీడీఓ పరిశీలన



నవతెలంగాణ- తాడ్వాయి

మండలంలోని వెంగళపూర్, బయ్యక్కపేట్, నార్లాపూర్, మేడారం గ్రామపంచాయతీ పరిధి హరితహార నర్సరీలను మంగళవారం ఎంపీడీవో సుమన వాణి సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారం మొక్కలు లక్ష్యానికి అనుగుణంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శినిలకు సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణ సక్రమంగా నిర్వహించాలని, పిచ్చి మొక్కలన్నిటిని తొలగించి మొక్కల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా చూడాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మరమ్మతు పనులను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నవతెలంగాణ-మహాదేవపూర్

చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మతు పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహాదేవపూర్ మండల పరిధి బీర సాగర వద్ద చేపట్టిన చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 45 వేల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. పంప్ హౌస్‌లో ఉన్న మూడు మోటార్లు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పంప్ హౌస్ ద్వారా మందిరం, ఎర్ర చెరువులకు సాగు నీరు సరఫరా ఉంటుందన్నారు. 65 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 35 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉన్నట్లు చెప్పారు. రానున్న వానా కాలం వరకు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు మహా దేవపూర్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ప్రాజెక్టు పనులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈలు యాదగిరి, తిరుపతిరావు, ఏఈ విజయ్ కుమార్‌తోపాటు, పలువురు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణను కలెక్టర్ పరిశీలన



నవతెలంగాణ - ములుగు

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి మాట్లాడారు. 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ అనుమతి లేదని అన్నారు. అనంతరం పరీక్షా కేంద్రంలో తాగునీరు, కనీస మౌళిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వైద్య శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలిస్ ఎస్కార్ట్‌తో చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 21 పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన మొత్తం 3088 మంది విద్యార్థులకు గాను 3081 మంది విద్యార్థులు హాజరయ్యారని, 7గురు గైర్హాజరయ్యారని తెలిపారు. 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21 మంది శాఖాధికారులు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్, 6 సిట్టింగ్ స్క్వాడ్, 200 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, చీఫ్ సూపరింటెండెంట్ తిరుపతి, డిఓ రవీందర్, తదితరులు ఉన్నారు.

ఏడుగురు బైండోవర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

పస్రా పోలిస్టేషన్ పరిధిలో 7గురిని మంగళవారం బైండోవర్ చేసినట్లు పస్రా ఎస్ఐ ఏ కమలాకర్ తెలిపారు. పస్రా పరిధిలో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమరుస్తున్నారన్న సమాచారంతో సదరు ఏడుగురు ప్రాజెక్ట్ నగర్‌కు చెందిన వాసం శివాజీ, జక్కు శంకర్, జక్కు రాజు, చల్వాయికి చెందిన తల్లడి సోమయ్య, చేరుకుల వెంకటేశ్వర్లు, దుంపెల్లిగూడెంకు చెందిన పన్నలా అభిలాష్, ఎర్రబోయిన కొమురయ్యను అదుపులోకి తీసికున్నారు. స్థానిక తహసీల్దార్ ముందు హాజరు పరిచి బైండోవేర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బైండోవేర్ చేసిన వ్యక్తులు తిరిగి విద్యుత్ తీగలు అమర్చితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాసిరకంగా సీసీ రోడ్ల పనులు

సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పస్రా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుండి ఎనిమిది సీసీ రోడ్లు మంజూరు కాగా నాసిరకంగా నిర్మాణాలు చేపడుతున్నారని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. మంగళవారం రోడ్ల పనులను వారు పరిశీలించి మాట్లాడారు. వరదల్లో కొట్టుకొచ్చిన నాసిరకం ఇసుకను ఉపయోగిస్తున్నారని ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని అన్నారు. 12 ఫీట్ల 3ఇంచుల సీసీ రోడ్డు పోయాల్సి ఉండగా 12 ఫీట్లు మాత్రమే పోశారని అన్నారు. 7మందంకు బదులు 6 ఇంచులు మాత్రమే పోశారని ఆరోపించారు. దీంతో రోడ్డు పోసిన మరుసటి రోజు రోడ్డు పగుళ్లబట్టిందని వాపోయారు. వాటర్ క్యూరింగ్ కూడా సరిగా చేయలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తామని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏఈ, డీఈలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, పొద్దిల్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, స్థానికులు ఎర్రవెల్లి రాజు, చలగొండ వెంకన్న, కడారి వెంకటేష్, ఎండీ జానీ, చింటూ, కొప్పరి ప్రసాద్ ప్రసాదు, షారుఖాన్, యన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ : సీఐ మల్లేష్ యాదవ్

నవతెలంగాణ-చిట్యాల



రాబోయే పార్లమెంటు ఎలక్షన్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ మల్లేష్ యాదవ్ హెచ్చరించారు. మంగళవారం చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గొడవలు పెట్టుకున్నా కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

6

జయశంకర్

ములుగు - భూపాలపల్లి

బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

ఉపాధ్యాయ పెండింగ్ బకాయిలు చెల్లించాలి : డీటీఎఫ్

నవతెలంగాణ-మల్హర్‌రావు



ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి పెండింగ్ బకాయిలు, డీఏ ఏరియర్స్ చెల్లించి జీఓ 317ను సమీక్షించి న్యాయం చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ తిరుపతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని కొయ్యూర్ గ్రామ మండల వనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు టి నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి మాట్లాడారు. మన ఊరు మన బడి లో భాగంగా ప్రారంభించిన పనులకు బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి షేక్ మెహరాజ్,సూదర్శన్, శివకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చిరుధాన్యాలు తీసుకోవాలి : సీడీపీఓ స్వాతి

నవతెలంగాణ - ములుగు

ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఐరన్ పుష్కలంగా లభిస్తుందని, దీంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని సీడీపిఓ స్వాతి అన్నారు. మంగళవారం ములుగు బస్టాండ్ లో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ మారుతున్న కాలంలో చాలా మంది అనారోగ్యాల పాలవుతున్నారని, ప్రతి ఒక్కరు రోజువారి ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలని అన్నారు. సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, అరుణ, సరస్వతి, సిసిఐ రాణి, తదితరులు పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి : కళావతి

నవతెలంగాణ-గోవిందరావుపేట



ఐసీడీఎస్ సేవలతోపాటు అందిస్తున్న పోషకాహారంను వినియోగించుకోవాలని సూపర్వైజర్ కళావతి అన్నారు. మంగళవారం మండలంలో పోషణ పక్షంలో భాగంగా పస్రా-2, గాంధీనగర్ అంగన్ వాడీ కేంద్రాలలో గర్భిణీలకు, మహిళలకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీహెచ్ఈడబ్ల్యూ నుండి స్రవంతి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ఏఎన్ఎం సరోజన, ఆశవర్కర్ అనిత, మరియు అంగన్వాడీ టీచర్స్ తారబాయ్, రాజేశ్వరి, ఏడబ్ల్యుహెచ్ లలిత, లీలా పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి : తిరుపతమ్మ



నవతెలంగాణ-గణపురం

పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ అన్నారు. మండలంలోని మేరపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం పట్ల అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు వాటి ప్రాముఖ్యత, రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అంగన్వాడీ టీచర్ రాణి. ప్రసన్న. తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి : సిడిపిఓ రాధిక



నవతెలంగాణ-మల్హర్‌రావు

మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని మహాదేవపూర్ సిడిపిఓ రాధిక కోరారు. మండలంలోని కొండంపేట అంగన్ వాడి కేంద్రాల్లో మంగళవారం పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని అంగన్ వాడిల మండల సూపర్ వైజర్ సరస్వతి నిర్వహించారు. సిడిపిఓ హాజరై మాట్లాడారు. శిశువు పుట్టగానే ముర్రుపాలు పట్టిస్తే పోషకాలు అందుతాయన్నారు .6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. ఆరు నెలలు దాటిన వెంటనే తల్లిపాలతోపాటు అంగన్ వాడిల్లో అందించే బాలామృతం, గుడ్లు పెట్టాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, అంగన్ వాడి టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

సూరారం అంగన్‌వాడీ కేంద్రంలో..

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ ఐసిడిఎస్ పరిధి సూరారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్వైజర్ బి రమాదేవి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభ, సంతోషి, శాంత, చంద్రిక, ఆశా కార్యకర్తలుబ పాల్గొన్నారు.



అధికారులు దాడులు చేసినా... ఆగని అక్రమ ఇసుక దందా ?

రాత్రి,పగలు తేడా లేకుండా ట్రాక్టర్లతో రవాణ

గ్రామాల్లో భారీగా డంపులు ఏర్పాటు

రాత్రి వేళల్లో లారీలతో పట్టణాలకు తరలింపు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పోలీస్,రెవెన్యూ,ఫారెస్ట్ అధికారులు అక్రమ జీరో ఇసుక దందాపై దాడులతోపాటు,లారీల యజమానులు, డ్రైవర్లపై ఎన్ని కేసులు నమోదు చేసిన మల్హర్, కాటారం మండలాల్లో అక్రమ జీరో ఇసుక దందా ఆగడం లేదు.జీరో ఇసుక దందా యధేచ్ఛగా కొనసాగుతోంది. ఎక్కువగా మండలంలోని ఇప్పలపల్లి, కేశారంపల్లి గ్రామాల్లో కాటారం మండలంలో గంగారం, విలాసాగర్, రేగులగూడెం గ్రామాల్లో అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతోంది. రాత్రి,పగలు తేడా లేకుండా రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను మానేరు నుంచి రవాణ చేస్తూ ఊరి చివరల్లో భారీగా డంపులు చేస్తూ రాత్రి వేళల్లో లారీల ద్వారా వరంగల్, హైదరాబాద్ పట్టణాలకు తరలిస్తూ లక్షల సంపాదిస్తున్నారు. కాటారంలోని గంగారం,రేగుల గూడెం, విలాసాగర్ గ్రామాల్లోని కోళ్ల ఫారాలు, మోడల్ స్కూల్, అసంతృప్తిగా నిర్మాణంలో ఉన్న రైతు వేదిక,ఊరు చివరలో మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రాత్రి వేళల్లో భారీగా డంపుల నిల్వలు చేస్తూ తెల్లవారుజామున లారీల ద్వారా పట్టణాలకు తరలిస్తూ లక్షలు గడిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుకాసురులు అందరి కళ్ళు గప్పి తాడిచెర్ల సెక్షన్ పరిధిలోని దేశబంధం మానేరు నుంచి ఇసుకను తోడేస్తూ అటవిమార్గం మీదుగా నాచారం,ఆన్ సాన్ పల్లి, వెంచరామి, నేరేడు పల్లి, గొర్లవిడు,కొంపల్లి మీదుగా భూపాలపల్లి జిల్లా కేంద్రానికి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇటీవల అధికారులు మాటు వేసి దాదాపు పది లారీలు పట్టుకొని కేసులు నమోదు చేశారు. అయినా అక్రమ ఇసుక రవాణా అగకపోవడం గమనార్హం.





జోరుగా రవాణా...

మల్హర్,కాటారం మండలాల్లో మానేరు పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక జీరో దందా జోరుగా సాగుతోంది. మానేరులో నీటి ప్రవాహం తగ్గిపోయి ఎడారిగా మారడంతో అక్రమ ఇసుక వ్యాపారులు అడ్డుఅదుపు లేకుండా 4 నుంచి 6 పిట్ల వరకు భారీగా గుంతలు తోడేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.ఇసుక వ్యాపారులు అదురు, బెదురు లేకుండా మూడు ట్రాక్టర్లు ఆరు లారీలుగా సాగుతున్న ఈ అక్రమ దందాకు ముకుతాడు వేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులు అక్రమ ఇసుక జీరో దందాకు అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ ఇసుక దందా అరికట్టాలి : బీఆర్ఎస్

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని తాడిచెర్ల, ఇప్పలపల్లి గ్రామాల్లో నడుస్తున్న అక్రమ ఇసుక దందాను ప్రభుత్వం, అధికారులు అరికట్టాలని మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, తాడిచెర్ల ఎంపిటిసి-1 సభ్యురాలు రావుల కల్పన మొగిలి, మాజీ జెడ్పిటిసి గోనె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దీ రోజుల్లోనే అక్రమ ఇసుక దందా మొదలు పెట్టడంపై మండిపడ్డారు. తాడిచెర్ల శివారులోని మానేరు నుండి గత రెండు నెలలుగా అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నదని ఆరోపించారు. అక్రమ ఇసుక దందాకు మండల అధికారులు నాయకులకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ ఇసుక దందాను తాడిచెర్ల నుంచి మల్లారం, కొయ్యూర్, కాటారం మీదుగా హైద్రాబాద్ కు తరలిస్తూ లక్షలు ఘడిస్తున్నారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఇసుక అక్రమ రవాణ జరిగితే ఇసుక లారీలు అధికార పార్టీ మాజీ ఎమ్మెల్యే పుట్టమధుకు సంబంధం ఉందన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కోట రవి, అన్నమనేని మధుసూదన్ రావు, తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తున్న కలెక్టర్ : ఆదివాసీ విద్యార్థి సంఘం

నవతెలంగాణ -తాడ్వాయి



గిరిజన చట్టాలు, జీఓలు, హక్కులను కాలరాస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ ప్రభుత్వం తక్షణమే బదిలీ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నెబెల్లి గణేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షులు దబ్బగట్ల శ్రీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గణేష్ మాట్లాడారు. ములుగు జిల్లా కలెక్టర్ ఆదివాసీలు, గిరిజనుల పట్ల నియం తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మేడారం జాతర విషయంలో కూడా పట్టింపు లేనట్లు వ్యవ హరించారని మండిపడ్డారు. గిరిజనుల అభివృద్ధి కోసం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్‌ను తీసుకొచ్చి ఐటీడీఏను ఏర్పాటు చేస్తే, సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అధికారాలను కూడా కలెక్టర్ చేతుల్లోకి లాక్కొని ఐటీ డీఏ పరిపాలన అధికారిని అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ములుగు జిల్లాకు సంబంధించిన స్టాఫ్, నర్సుల నియామకాలలో గిరిజనులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. షెడ్యూల్ ఏరియాలో హెల్త్ విభాగంలో ఒక గెజిటెడ్ ఆఫీసర్ పోస్ట్ తప్ప మిగతా పోస్టులన్నీ సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేటర్ ప్రాజెక్ట్ అధికారే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేయాల్సి ఉండగా, జిల్లా కలెక్టర్, వైద్యాధికారి ఎలా నోటిఫికే షన్ జారీ చేసి భర్తీ చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కమిషనర్ గైడ్ లైన్స్ తుంగలో తొక్కా రని అన్నారు. ఇదే నోటిఫికేషన్ కొమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, మహబూబాబాద్ ఇతర జిల్లాలో సంబంధిత గైడ్‌లైన్స్ ప్రకారమే ఇచ్చారని, ఇక్కడ మాత్రం పూర్తి విరుద్ధంగా నోటిఫికేషన్ జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌పై ఎస్సీ. ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేసి భర్తీ చేసిన షెడ్యూల్ ఏరియా పోస్టులను ఐటిడిఏ పీఓ ద్వారా రీ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. సంబంధిత కలెక్టర్, వైద్యాధికారి పై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే న్యాయ పోరాటాలతో పాటు దశలవారి నిరసన కార్యక్రమాలు చేపడతా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అలం నగేష్, ఏఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కళ్యాణ్, నవీన్, సురేందర్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌లకు మరమ్మతులు

నవతెలంగాణ-ఏటూర్‌నాగారం ఐటిడిఏ

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ సమీపంలోని మిషన్ భగీరథ నీళ్ల పైపులు పగిలిపోవడంతో స్థానిక గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి దామోదర్ స్వామి కార్యదర్శి రమాదేవిలు స్పందించి మంగళవారం మరమ్మతులను చేయిం చారు. వాటర్ ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో అవుతున్న నీరు పక్కనే ఉన్న ప్రెస్‌క్లబ్ భవనంలోకి నీరు రావడంతో నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అంతేకాకుండా పైపులైన్ భవనం కింద నుంచి ఉండడంతో లీకేజీలు అవుతున్నాయని గమనించి పైప్ లైన్‌ను రోడ్డుకు మరోవైపు నుండి మార్పిం చారు. మిషన్ భగీరథ సిబ్బంది ట్యాంక్ వద్ద పర్య వేక్షణ చేస్తూ నీటిని నింపాలని గ్రామస్తులు అధికా రులకు విన్నవించారు. వాటర్ ఓవర్‌ఫ్లో అయితే చుట్టూ ఇళ్లు, పక్క భవన నిర్మాణాలకు నీరు వచ్చి చేరుతుందని స్థానికులు వాపోయారు. ఓవర్‌ఫ్లో కాకుండా చూస్తామని, లీకేజీలు లేని పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. సిబ్బంది రవీందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నారాయణ హైస్కూల్ లో గ్రీన్ కలర్ డే వేడుకలు

నవతెలంగాణ-గణపురం



మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హై స్కూల్ లో మంగళవారం గ్రీన్ కలర్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సేవ్ ఎర్త్ అండ్ ప్రొటెక్ట్ ఫ్రమ్ గ్లోబల్ వార్మింగ్ అనే అంశంపై జరిగిన సెమినార్లలో విద్యార్థులు పాల్గొన్నారు. చెట్లను కాపాడండి, తక్కువ నీటిని విని యోగించండి, తక్కువ విద్యుత్తును వినియోగించండి, మైనింగ్‌కు దూరంగా ఉండండి, ప్లాస్టిక్‌లను ఉపయోగించవద్దు అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ ఎ భానుచందర్, ప్రిన్సిపాల్ ఎ స్రవంతి, డైరెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం : ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయ

నవతెలంగాణ- తాడ్వాయి





చిన్నపిల్లలకు బాలింతలకు గర్భిణీలకు సంపూర్ణ ఆరోగ్యమే సమగ్ర మాత శిశు అభివృద్ధి సంస్థ, లక్ష్యమని, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ అన్నారు. మంగళవారం మండలంలోని కామారం(టి), దామెరవాయి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పరీక్ష కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ విజయ, అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ గర్భిణీలు. బాలింతలు చిన్నారుల్లో పోషకాహారం లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దమే లక్ష్యంగా పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనపు ఆహార విశిష్టత, తల్లిపాల ఆవశ్యకత, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీ ప్రదేశాల్లో పెరటి తోటల పెంపకం పెంచే మొక్కలను సంరక్షించి పర్యవేక్షించాలన్నారు. చిన్నారులు కిశోర బాలికలు బాలింతలను పోషకాహార లోపం నుంచి విముక్తి చేయడం ఆరోగ్యవంతులను చేయడానికి పోషణ పక్వాడ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా వర్కర్ బి జ్యోతి, దామరవాయి అంగన్వాడి టీచర్లు సావిత్రి, అమత, కామారం అంగన్వాడి టీచర్లు నాగమణి, జానకి, గ్రామస్తులు, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ - ములుగు



జెడ్పిహెచ్ఎస్ జంగాలపల్లి 2006-07 పదవ తరగతి విద్యార్థులు 17 సంవత్సరాల తరువాత యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం వద్ద అందరూ కలిసి మంగళవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జీవితంలో గడిపిన రోజులను మరోసారి గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం జీవితంలో అనుభవించే బాధలు, బాధ్యతలు, కష్టాలు, సుఖాలను ఆత్మీయంగా చెప్పు కుంటూ ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా నిలిచి బమనోధైర్యాన్ని ఇచ్చేలా సహాయం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమం లో అచ్చునూరి కిషన్, మేకల వంశీ, బురం వెంకటేష్, సోమల్ల మహేష్, మేకల అశోక్, రేగుల బాషా, రేగుల సాయి కిరణ్, లోకుల ప్రమోద్, వైనాల శ్రీనివాస్, రేణికుంట్ల శ్రీమాన్, గుండె రాజేష్, మహేష్, రాయబారపు కష్ణ, భావన్, తులసి రాం, సురేష్, రోజా, కవిత, మహాలక్ష్మి, లలితా, రాధిక, సుమలత, స్వాతి, సజన తదితరులు పాల్గొన్నారు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్..

నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మృతి

నవతెలంగాణ-మహాదేవపూర్

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దుల్లోని రేపన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కోలా మరక అటవీ ప్రాంతం లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఈరోజు ఉదయం ఎదురు కాల్పులు చోటుచేసుకు న్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన నలు గురు మావోయిస్టు అగ్రనేతలు మృతిచెందారు. వారిని డీవీసీ సభ్యు లు వర్గీష్, మంగాతు, ప్లాటూన్ సభ్యులు కురుసం రాజు, వెంకటేశ్‌గా గుర్తించారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. మృతుల్లో ఇద్దరిపై పోలీసులు శాఖ గతంలో భారీ రివార్డు ప్రక టించింది. వారిపై రూ.36 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతున్నదని వెల్లడించారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

సీఎంఓ ఏఐ ఆధ్వర్యంలో జీఎంకు వినతి

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

మందమరి ఏరియాలో కాజీపేట గనిలో గత రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో కర్రీ రాజు అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోయిన విషయం విధితమే. ఈ సంఘటనలో సరైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని మంగళవారం సీఎంఓ ఏఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియా జిఎం బళ్ళారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదానికి కారణంగా శశిధర్ అనే ఇంజనీర్‌ను సస్పెండ్ చేయడం, మందమర్రి ఏరియా స్టోర్ ఇన్‌చార్జి ఫైడేశ్వర్ కు చార్జ్ షీట్ ఇవ్వడం సరి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వెంకటయ్య, భూపాలపల్లి ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు టి. వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యక్షులు జాకీర్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి రాజగోపాల్, కవింద్ర డిజిఎం(క్వాలిటీ), కేటికే వన్ గ్రూప్ ఏజెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ- టేకుమట్ల

కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మఖహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఏంపేడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఏం పేడు గ్రామానికి చెందిన అడ్డూరి కార్తీక్ (23) కొన్ని రోజుల నుండి కడుపునొప్పి, అస్తమాతో బాధపడుతుండేవాడు. ఈనెల 12న ఇంట్లో ఎవరూ లేనప్పుడు కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. వైద్య నిమిత్తం కొరకు జమ్మికుంట లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి అడ్డూరి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభ సభాధిపతి స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు స్మారకార్థము 2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బూడిద దుర్గ వెంకట్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బూడిద మల్లేష్ పెన్నులు పంపిణీ చేసి తెలంగాణ ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇందారపు వంశీకష్ణ, ప్రమోద్‌కుమార్, బందెల వరుణ్ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న మహిళ అరెస్ట్

నవతెలంగాణ-గోవిందరావుపేట

ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థమైన గుడుంబా తరలిస్తున్న మహిళలను మంగళవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పసర ఎస్ఐ ఎ కమలాకర్ తెలిపారు. తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా పస్రా చౌరస్తాలో అను మానాస్పద స్థితిలో రాంనాగంకు చెందిన జర్పుల కవిత బ్యాగు తో సంచరిస్తోంది. ఆమె దగ్గరికి వెళ్లి తనిఖీ చేయగా బ్యాగులో 10లీటర్ల గుడుంబా పట్టుబడింది. ఆమెను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ పరిశీలన

నవతెలంగాణ-గోవిందరావుపేట

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం గోవిందరవుపేట, దుంపెల్లి గూడెం, రాంనగర్,కోటగడ్డ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ కమలాకర్ పరిశీలించారు. ఆయా పోలింగ్ సెంటర్స్‌లో గతం లో జరిగిన ఎన్నికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు.

డిపాజిట్లు కోల్పోతున్నరు

కొన్నేండ్లుగా పెరుగుతున్న ఇలాంటి అభ్యర్థుల సంఖ్య

1951 మొదటి లోక్‌సభ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు వీరి సంఖ్య 71వేలకు పైగానే

- 2019 ఎన్నికల్లో ఇది 86 శాతం
- ఎన్నికల సంఘం సమాచారం



న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే పలువురు అభ్యర్థులు విజయం సాధించకపోయినా.. డిపాజిట్లు దక్కించుకోవటాన్ని ఒక సవాలుగా తీసుకుంటారు. ముఖ్యంగా, ప్రధాన పార్టీల అభ్యర్థులకైతే ఇది పరువుకు సంబంధించిన అంశం. ఒక అభ్యర్థి డిపాజిట్ కోల్పోతే ప్రత్యర్థి పార్టీలు, నాయకులకు విమర్శించే ఆయుధం దొరికినట్టుగా భావిస్తారు. అయితే, దేశంలో జరిగే పలు ఎన్నికల్లో ఇలా డిపాజిట్లు కోల్పోతున్న అభ్యర్థుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతున్నది. ఎన్నికల సంఘం సమాచారాన్ని విశ్లేషిస్తే ఈ విషయం వెల్లడైంది.

ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం.. దేశంలో 1951లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికల నుంచి పలు పార్టీలు, స్వతంత్రులు 71,000 మందికి పైగా అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పోలైన మొత్తం చెల్లుబాటు అయ్యే ఓట్లలో కనీసం ఆరో వంతు ఓట్లను పొందటంలో విఫలమైనందుకు తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు. 2019 ఎన్నికల్లో 86 శాతం మంది అభ్యర్థులు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు. పోలైన మొత్తం చెల్లుబాటయ్యే ఓట్లలో కనీసం ఆరో వంతు ఓట్లను పొందటంలో విఫలమైతే.. వారి డిపాజిట్లను ట్రెజరీకి మళ్లించాలని ఎన్నికల సంఘం నిబంధనలున్నాయి.

ఏమిటీ సెక్యూరిటీ డిపాజిట్?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత మొత్తాన్ని ఎన్నికల కమిషన్‌కు చెల్లించాల్సి ఉంటుంది. ఇది జనరల్ అభ్యర్థులకు రూ.25వేలుగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 12,500గా ఉన్నది. అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పోలైన మొత్తం చెల్లుబాటు అయ్యే ఓట్లలో కనీసం ఆరోవంతు ఓట్లను పొందితే.. వారు తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను పొందగలుగుతారు. లేకపోతే, ఆ డిపాజిట్ మొత్తాన్ని అభ్యర్థులు కోల్పోతారు.

మొదటి లోక్‌సభ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు పోటీ చేసిన 91,160 మంది అభ్యర్థులలో 71,246 మంది తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు. అంటే, మొత్తం 78 శాతం మంది కనీసం డిపాజిట్‌ను కూడా దక్కించుకోలేదు. 1951లో జనరల్ అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యర్థులు రూ.250 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉండేది. అది ప్రస్తుతం జనరల్ అభ్యర్థులకు రూ.25,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.12,500కి పెరిగింది. ఎన్నికల్లో అభ్యర్థులు డిపాజిట్లను కాపాడుకోవటం గర్వకారణంగా, డిపాజిట్లు జప్తు చేయటం అవమానకరమైనదిగా భావిస్తారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచే అధికంగా

2019 ఎన్నికలలో, ప్రముఖ రాజకీయ పార్టీలలో బీఎస్పీ అత్యధిక స్థానాల్లో డిపాజిట్లను కోల్పోయింది. ఆ పార్టీ నిలిపిన 383 మంది అభ్యర్థులలో 345 మంది డిపాజిట్లను దక్కించుకోలేకపోయారు. ఇక తర్వాతి స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన 421 మంది అభ్యర్థులలో 148 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఇక బీజేపీ నుంచి 51 మంది అభ్యర్థులు డిపాజిట్లు దక్కించుకోవటంలో విఫలమయ్యారు. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి 86 శాతం మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు కావటం గమనార్హం.

ఆయా లోక్‌సభ ఎన్నికల్లో ఇలా..!

1951-52లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 40 శాతం, అంటే 1,874 మంది అభ్యర్థుల్లో 745 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయే ట్రెండ్ క్రమంగా పెరిగింది.

1996లో జరిగిన 11వ లోక్‌సభ ఎన్నికల సమయంలో 91 శాతం అంటే 13,952 మంది అభ్యర్థుల్లో 12,688 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో లోక్‌సభ స్థానాలకు అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడ్డారు.

1991-92లో, 8,749 మంది అభ్యర్థులలో 7,539 మంది (86 శాతం మంది) తమ సెక్యూరిటీ డిపాజిట్ కోల్పోయారు.


2009లో, 8070 మందిలో 6829 మంది అభ్యర్థులు(85 శాతం మంది) అభ్యర్థులు డిపాజిట్లు పొందలేకపోయారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల్లో పలు పార్టీలు, స్వతంత్రులు 8,251 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో 7,000 మంది (84 శాతం) తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు.

జాతీయ పార్టీల ప్రదర్శన ఒకే.. 2009 లోనే దారుణం

జాతీయ పార్టీల అభ్యర్థులు తమ డిపాజిట్లను నిలుపుకోవటంలో మంచి ప్రదర్శననే కనబరుస్తున్నారు. 1951-52లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు చెందిన 1,217 మంది అభ్యర్థుల్లో 28 శాతం మంది మాత్రమే, అంటే 344 మంది డిపాజిట్లు కోల్పోయారు. 1957లో తదుపరి ఎన్నికలలో 919 మంది అభ్యర్థులలో 130 మంది(14 శాతం) అభ్యర్థులు మాత్రమే డిపాజిట్లు దక్కించుకోలేకపోయారు. 1977 ఎన్నికల్లో మాత్రం జాతీయ పార్టీలు చక్కని ప్రదర్శననే కనబర్చాయి. ఈ సంఖ్య అతి తక్కువగా 9 శాతంగానే ఉన్నది. ఈ పార్టీలకు చెందిన 1,060 మంది అభ్యర్థులలో 100 మంది మాత్రమే (తొమ్మిది శాతం) డిపాజిట్లు కోల్పోయారు. 2009 సార్వత్రిక ఎన్నికలు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ పార్టీల అభ్యర్థులలో దాదాపు ప్రతి రెండో అభ్యర్థి డిపాజిట్లు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు చెందిన 1,623 మంది అభ్యర్థుల్లో 779 మంది డిపాజిట్లు దక్కించుకోలేదు.

ప్రజలకు రాజకీయాలపై ఆసక్తి

ఢిల్లీ యూనివర్శిటీలోని జీసస్ అండ్ మేరీ కాలేజ్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సుశీల రామస్వామి మాట్లాడుతూ... భారత్‌లో రాజకీయ కార్యకలాపాలు చాలా ప్రాథమికమైనవిగా భావించబడుతున్నందున చాలా మంది అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కోల్పోయినప్పటికీ ఎన్నికలలో పోటీ చేస్తారనీ, ప్రజలు రాజకీయాలపై చాలా ఆసక్తిని కలిగి ఉంటారని అన్నారు. మరికొందరు, వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఇష్టపడతారని తెలిపారు.భారత్‌లో 18వ లోక్‌సభకు ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో(ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీలలో) జరగనున్నాయి. జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్ వంటి పలు పార్టీల కూటమి 'ఇండియా' మధ్య ప్రధాన పోటీ ఉండనున్నదని ఎన్నికల విశ్లేషకులు చెప్తున్నారు.



ఆ నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

- పోలీసులకు ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్ ఆదేశాలు : నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రజాసంఘాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన ట్రాన్స్ యువతి మెడలో చెప్పుల దండేసి, గుండు గీసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని రాచ కొండ పోలీసులను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య మంగళవారం ఆదేశించారు. హయత్ నగర్‌కు చెందిన రమావత్ సౌమ్యను ఫోన్ చేసి, చౌటుప్పల్‌కు పిలిపించుకుని కారులో నల్గొండకు కిడ్నాప్ చెసి నిందితులు తీవ్రంగా కొట్టారని తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కేఎంవీ మోనాలిసా, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, ట్రాన్స్ జెండర్ నేత కోకిల, బాధిత యువతి సౌమ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యను వారు కలిశారు. తమ గ్రూప్‌లోనే ఉండాలని నందిని ముఠా కిడ్నాప్ చెసి, నల్లగొండలో బంధించి మెడలో చెప్పుల దండేసి గుండు గీయించి అవమానపరిచారని వివరించారు. ఈ సంఘటనపై చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా కేవలం ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పది రోజులైనా నిందితులను అరెస్టు చెయలేదని చైర్మెన్‌కు వివరించారు. దీంతో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని . కమిషన్ చైర్మెన్ అదేశించారు.

రాఫాలో ముమ్మరంగా కొనసాగుతున్న దాడులు

పాలస్తీనా ఖండన

- కొనసాగుతున్న దోహా చర్చలు
- ఉత్తర గాజాలో పొంచివున్న కరువు



గాజా : రాఫా నగరంలో ఇజ్రాయిల్ బలగాలు జరుపుతున్న విధ్వంసక చర్యలను, కార్యకలాపాలను పాలస్తీనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. అక్కడ బాంబు దాడులు ఉధృతమయ్యాయని, ఒక పద్ధతి ప్రకారం విధ్వంసక చర్యలను చేపడుతున్నారని పేర్కొంది. అంతర్జాతీయంగా విమర్శలు, ప్రతిస్పందనలు ఎదురవకుండా వుండేందుకు మూడోకంటికి తెలియకుండా రాఫా నగర విధ్వంసాన్ని ఇజ్రాయిల్ ప్రారంభించిందని పాలస్తీనా విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాఫా నగరంలో ధ్వంసమైన ప్రాంతాలు, నివాస భవనాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందని పేర్కొంది. కాగా దాదాపు 10లక్షల మంది పాలస్తీనియన్లు తల దాచుకున్న రాఫా నగరంపై సైన్యంతో దాడి చేయడం ఘోర తప్పిదం కాగలదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ హెచ్చరించారు. ఈ నగరంపై దాడి విషయంలో పునరాలోచన చేయాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును కోరారు. కాగా రాఫాపై పదాతిదళం దాడికి ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించేందుకు ఇజ్రాయిల్ ప్రతినిధి బృందాన్ని వాషింగ్టన్ పంపేందుకు ప్రధాని నెతన్యాహు అంగీకరించారు. ఇప్పటివరకు గాజా యుద్ధంలో 31,819మంది మరణించగా, 73,934మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ గణాంకాలు పేర్కొన్నాయి.

గాజా ప్రాంతంలోని 70శాతానికి పైగా ప్రజలు ముఖ్యంగా ఉత్తర గాజా ప్రాంతం కరువు బారిన పడే ప్రమాదం పొంచి వుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. ఈ విపత్తు పూర్తిగా మానవ కల్పితమేనని, సకాలంలో సరైన చర్యలు తీసుకుంటే నివారించదగ్గదేనని అన్నారు. తాజాగా విడుదలైన గణాంకాలు చూస్తే పరిస్థితి చాలా దారుణంగా వుందని, పశు గ్రాసాన్ని తినడానికి కూడా ప్రజలు వెనుకాడని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. పోషకాహార సమస్య చాలా తీవ్రంగా నెలకొందని తెలిపింది.

కాగా కాల్పుల విరమణ చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని కతార్ పేర్కొంది. చర్చల్లో పురోగతి వుంటుందా లేదా అనేది ఇప్పుడే మాట్లాడడం తొందరపాటు అవుతుందని కతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. అయితే రాఫా నగరంపై ఏ దాడి జరిగినా అది మానవ విపత్తుకు దారి తీయగలదని, అప్పుడు చర్చలపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. తాత్కాలికంగా కాల్పుల విరమణ, మానవతా సాయంపైనే ప్రదానంగా దృష్టి సారించి దోహాలో చర్చలు సాగుతున్నాయని తెలిపారు.

మిలియన్ దాటిన యాప్ ఇన్‌స్టలేషన్లు

నవతెలంగాణ - హైదరాబాద్

ఆవిష్కరించిన నెలరోజుల్లోనే 10లక్షలకు పైగా ఇన్స్టలేషన్లు జరిగాయని భారతదేశపు స్వదేశి యాప్ మార్కెట్ ప్లేస్ అయిన ఫోన్ పేకు చెందిన ఇన్డాస్ యాప్ స్టోర్ మంగళవారం ప్రకటించింది. కోఫౌండర్ సీపీవో ఆకాష్ దోంగ్రే మాట్లాడుతూ వినియోగదారులు ఒక మెరుగైన ఉత్పత్తి ఎక్స్పిరియన్స్ను అందించడంలో ఇలాగే ముందు నిలిచేలా కొత్త హంగులను నిరంతరం కొనసాగి స్తూ మా యాప్ స్టోర్ ఎక్స్పిరియన్స్ను మెరుగుప రుస్తూ ఉంటామన్నారు. ప్రతి 10 రోజులకు కొత్త కొత్త అప్డేట్లు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నామన్నారు.

కొత్త పెట్టుబడి అవకాశాలను పరిచయం చేసిన టాటా ఏఐఏ

నవతెలంగాణ - హైదరాబాద్

గత కొన్ని సంవత్సరాలుగా, భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఒకటిగా వెలుగొందుతున్న టాటా ఏఐఏ, సంపదను సృష్టించాలని కోరుకునే పెట్టుబడిదారులకు స్థిరంగా కొత్త పెట్టుబడి అవకాశాలను పరిచయం చేసింది. విభిన్న థీమ్‌లను అన్వేషించే వారి కోసం టాటా ఏఐఏ 8 యూనిట్ లింక్డ్ ఉత్పత్తుల యొక్క బలమైన సూట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఉత్పత్తులు బహుళ కాల వ్యవధిలో అత్యుత్తమ రాబడిని అందించాయి, స్థిరంగా బెంచ్‌మార్క్‌ను అధిగమించాయి. ఫండ్ పనితీరుకు జోడించడం అనేది వినియోగదారులు కొనుగోలు చేయగల యూనిట్ లింక్డ్ సొల్యూషన్‌ల సూట్. వీటిలో ఫార్చ్యూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చ్యూన్ మాక్సిమా మొదలైన ఉత్పత్తులు ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాలలో, టాటా ఏఐఏ పరమ్ రక్షక్ (పీఆర్ సిరీస్ కింద పెట్టుబడి లింక్డ్ ప్లాన్‌లు ప్రవేశపెట్టింది. ఈ పరిష్కారాలు వినియోగదారులకు అధిక రక్షణ కవర్‌తో మార్కెట్ లింక్డ్ ప్లాన్‌లను పొందేలా చేస్తాయి, తద్వారా సంపద సృష్టి అవకాశాలతో ఆర్థిక భద్రత యొక్క ద్వంద్వ ప్రయోజనాన్ని అందిస్తాయి.

ఫోన్‌ట్యాపింగ్‌లో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు

- డీఎస్పీ డైరీలో వందలాది ఫోన్ నెంబర్లు
- ఒక మీడియా యజమాని కూడా కుమ్మక్కు
- బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నాయకుడు సూత్రధారి
- అడవిలో పారేసిన హార్డ్‌డిస్కల కోసం సాగుతున్న పోలీసుల వేట
- కొనసాగిన ప్రణీత్‌రావు మూడో రోజు విచారణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)లో కొనసాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్టు తెలిసింది. వరంగల్‌కు చెందిన ఈ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ప్రధాన నిందితుడు డీఎస్పీ ప్రణీత్‌రావు బ్యాచ్‌కు చెందిన అధికారులే అని తెలుస్తున్నది. అదే సమయంలో,ప్రణీత్‌రావు డైరీలో వందలాది ఫోన్ నెంబర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇంకోవైపు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఒక మీడియా యజమాని పాత్ర కూడా ఉన్నట్టు విచారణలో వెలుగు చూసింది. ఎస్ఐబీ కార్యాలయంలో డీఎస్పీగా ఉన్న సమయంలో ప్రణీత్‌రావు అధికారంలో ఉన్న కొందరు పెద్దల ప్రోద్బలంతో ప్రతిపక్షాలకు చెందిన పలువురు నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డట్టు వెలుగు చూడటం, ఈ ఉదంతంలో డీఎస్పీని ప్రభుత్వం సస్పెండ్ చేయటం తెలిసిందే. అతనిపై కేసు నమోదు చేసి, కోర్టు ఆదేశాల మేరకు ఏడ్రోజుల పాటు దర్యాప్తు అధికారులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం.. ప్రణీత్‌రావును విచారిస్తున్నది.

ఆధారాలను ధ్వంస చేసి.. అడవుల్లో పడేసి..

విచారణలో ప్రణీత్‌రావుకు సంబంధించి అనేక నిజాలు వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా, ఎస్ఐబీలోని లాగిన్ రూమ్, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) గదిలో ఫోన్ ట్యాపింగ్ పరికరాలను, కంప్యూటర్ హార్డ్ డిస్కలను ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు.. వాటిని తీసుకెళ్లి వికారాబాద్ అడవుల్లో పడేయటంతో ఆ పరికరాల కోసం ఒక ప్రత్యేక పోలీసు బృందం గాలింపులు జరుపుతున్నది. ఆ హార్డ్ డిస్కలలోనే తాను ట్యాపింగ్ చేసిన ప్రతిపక్ష నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర వ్యాపారుల డేటా ఉన్నదనీ, వాటిని విధ్వంసం చేయటం ద్వారా ఆధారాలు దొరకకుండా చేయాలనేది ప్రణీత్‌రావు కుట్రగా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

వరంగల్, సిరిసిల్ల, ఒక మీడియా సంస్థ యజమాని ఆఫీసులో సర్వర్లు

ఈ మూడ్రోజుల విచారణలో తాను ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డట్టు అంగీకరించిన ప్రణీత్‌రావు.. వాటి వివరాలను ఎస్ఐబీకి చెందిన ఒక మాజీ ఐజీకి అందజేసినట్టుగా కూడా బయటపెట్టినట్టు తెలిసింది. అదే సమయంలో, ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెనక ప్రధాన సూత్రధారిగా బీఆర్ఎస్‌కు చెందిన ఒక సీనియర్ నాయకుడు కీలక పాత్ర వహించినట్టుగా కూడా ప్రణీత్‌రావు బయటపెట్టినట్టు సమాచారం. అదే సమయంలో, సిరిసిల్ల, వరంగల్‌తో పాటు హైదరాబాద్‌లోని ఒక మీడియా సంస్థ యజమాని కార్యాలయంలో సర్వర్లను పెట్టి వాటి ద్వారా ఫోన్ ట్యాపింగ్‌లకు ప్రణీత్‌రావు పాల్పడినట్టు కూడా వెలుగు చూసింది.


ఫైల్

మూడు షిఫ్టుల్లో 15 మందికి పైగా సిబ్బంది

ఎస్ఐబీలోని లాగిన్‌రూమ్‌లో 17కు పైగా కంప్యూటర్ల సాయంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రణీత్‌రావు ముందుకు సాగించినట్టు అధికారులు కనుగొన్నారు. ఈ పనులు చూడటానికి మూడు షిఫ్టుల్లో 15 మందికి పైగా ఎస్ఐబీ సిబ్బందిని ప్రణీత్‌రావు వాడుకున్నారనీ, ఈ పనిని సక్రమంగా చేస్తే ప్రమోషన్లను ఇప్పిస్తానని ఆశ పెట్టినట్టు కూడా వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్లు మొదలుకొని కానిస్టేబుల్ స్థాయి అధికారుల వరకు ప్రణీత్‌రావు వాడుకున్నట్టు దర్యాప్తులో తేలింది. కాగా, ప్రణీత్‌రావు దగ్గర దొరికిన ఒక డైరీలో వందల సంఖ్యలో ఫోన్ నెంబర్లు ఉన్నాయనీ, వాటన్నిటినీ ట్యాపింగ్ చేసినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. అందులో అప్పటి అధికారపక్షం కోరుకున్న ప్రతిపక్ష నాయకుల ఫోన్ ట్యాపింగ్‌లతో పాటు పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మరికొందరు ఇతర వ్యాపారులు, సెలబ్రిటీలవి ఫోన్‌లు ట్యాపింగ్ జరిగినట్టు తెలుస్తున్నది.



మరికొందరు అధికారులు, సిబ్బంది విచారణకు రంగం సిద్ధం

ఇంకోవైపు, మీడియా యజమాని కోరిన మేరకు మరికొందరి ఫోన్ ట్యాపింగ్‌లకు కూడా ప్రణీత్‌రావు పాల్పడినట్టు బయట పడింది. మొత్తమ్మీద, ప్రణీత్‌రావు కొన్నేండ్ల కిందనే ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలకు తెరలేపినట్టు తెలుస్తున్నది. ఇందులో కొందరు జర్నలిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఫోన్‌నెంబర్లు కూడా ట్యాపింగ్‌కు గురైనట్టు వెలుగు చూసింది. దీంతో, ఇటు రాజకీయ పక్షాలు మొదలుకొని అటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల గుండెల్లో ఈ వ్యవహారం రైళ్లు పరిగెత్తిస్తున్నది. కాగా, దీనికి సంబంధించి ప్రణీత్‌రావుకు సహకరించారనే అనుమానాలున్న మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకొని ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారిస్తున్నట్టు తెలిసింది. అలాగే, ప్రణీత్‌రావుతో అంటకాగిన మరికొందరు అధికారులు, సిబ్బందికి కూడా నోటీసులు ఇచ్చి విచారించటానికి రంగం సిద్ధం చేశారు.

అడ్వెంచర్ టూరిజంపై కేరళ దృష్టి

- గతేడాది పర్యాటకుల్లో 16 శాతం వృద్ధి
- టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సలీం వెల్లడి





నవతెలంగాణ- హైదరాబాద్

కేరళ ప్రభుత్వం అడ్వెంచర్ టూరిజంపై కీలక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రకృతి అందాలతో దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఆ రాష్ట్రం.. ఇక అడ్వెంచర్, హెలీ టూరిజం అభివృద్ధికి భారీగా ఖర్చు పెడుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో బి2బి క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కేరళ టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ వీఎం సలీం మీడియాతో మాట్లాడారు. 2023లో దేశీయంగా 16 శాతం వృద్ధితో 2.2 కోట్ల మంది పర్యాటకులను ఆకర్షించామన్నారు. గతేడాది 88 శాతం పెరుగుదలతో 6.5 లక్షల విదేశీ పర్యాటకులు తమ రాష్ట్రానికి వచ్చారన్నారు. కొత్తగా 'కమ్ టు గెదర్ ఇన్ కేరళ' క్యాంపెయిన్‌తో పర్యాటకులను మరింత ఆకర్షించే పనిలో ఉన్నామన్నారు. ఇందులో భాగంగా హెలీ టూరిజంను ప్రవేశపెట్టబోతున్నామన్నారు. దీంతో 2024లో కేరళ టూరిజాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తూ రాష్ట్రంలోని అన్ని గమస్థానాలను కలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి 'స్కై ఎస్కేప్స్'గా నామకరణం చేశామన్నారు. దేశంలో సమగ్ర హెలీ టూరిజం పాలసీని తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు.

" గ్లోబల్ అడ్వెంచర్ టూరిజం మ్యాప్‌లో కేరళను ప్రథమస్థానంలో ఉంచే లక్ష్యంతో, ఈ ఏడాది నాలుగు అంతర్జాతీయ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఈవెంట్‌లను నిర్వహించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా 2032 నాటికి అడ్వెంచర్ టూరిజం 20 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. దేశీయ టూరిజం వృద్ధిలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నాము. అదే విధంగా ఏప్రిల్ 26 నుండి వయనాడ్‌లోని మనంతవడిలోని ప్రియదర్శిని టీ ప్లాంటేషన్‌లో జరుగుతుంది. మలబార్ రివర్ ఫెస్టివల్ 2024 జూలై 25 నుండి 28 వరకు కోజికోడ్‌లోని కోడెన్‌చేరిలో నిర్వహించనున్నాం." కేరళ టూరిజం శాఖ తెలిపింది. అక్టోబర్ నుండి మార్చి వరకు కేరళను సందర్శించేందుకు ఉత్తమ సమయమన్నారు. మారుతున్న పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా, వారి బసను మరింత థ్రిల్లింగ్ మార్చడానికి విస్తృతమైన వ్యూహాలను రూపొందిస్తున్నామని సలీమ్ తెలిపారు. కొత్త ప్రాజెక్టులతో పాటు, బీచ్‌లు, హిల్ స్టేషన్‌లు, హౌస్‌బోట్లు మరియు బ్యాక్‌వాటర్ సెగ్మెంట్ వంటి రాష్ట్ర ప్రధాన ఆకర్షణలు సందర్శకుల అనుభవాన్ని మరింతగా పెంచుతాయన్నారు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ కొత్త సీఈఓగా మధు శశిధర్



హైదరాబాద్ : ప్రముఖ ప్రయివేటు రంగ వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్ డివిజన్ ప్రెసిడెంట్ అండ్ సీఈఓగా మధు శశిధర్ నియమితులయ్యారు. ఆ సంస్థలోని హాస్పిటల్ వ్యాపారాలను నిర్వహించనున్నారు. పాండిచ్చేరిలోని జిప్‌మెర్‌లో వైద్య విద్యను పూర్తి చేసిన శశిధర్‌కు న్యూయార్క్‌లోని సెయింట్ లూక్స రూస్‌వెల్ట్ హాస్పిటల్‌లో పని చేసిన అనుభవం ఉంది. 2023 అక్టోబర్ నుంచి అపోలోలో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా ఉన్నారు. శశిధర్ అంతర్జాతీయ అనుభవం తమ సంస్థకు కలిసి రానుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అపోలో సంస్థలో 27 ఏళ్ల పాటు సేవలందించిన డాక్టర్ కె హరిప్రసాద్ ప్రస్తుత ప్రెసిడెంట్ తన పదవి నుంచి విరమణ పొందనున్నారు. కాగా అపోలో ఎండి సునీతా రెడ్డికి శశిధర్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

మహీంద్రా ట్రాక్టర్స్ నుంచి కొత్త ఓజా3140

హైదరాబాద్ : మహీంద్రా గ్రూపులో భాగమైన మహీంద్రా ట్రాక్టర్స్ కొత్తగా ఓజా 3140 మోడల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వరి పంటలకు సంబంధించిన తడి పనుల్లోనూ అసాధారణమైన ఫలితాలు చూపించనుందని ఆ సంస్థ తెలిపింది. 30-40 హెచ్‌పి సామర్థ్యంతో అసమానమైన పనితీరు, ఇంధన ఆదాను కలిగిన ఈ ట్రాక్టర్ తేలికగా ఉండటంతో పాటు అధునాతన పనితీరు కనపరుస్తుందని పేర్కొంది.

క్రోమాలో రూ.25వేలకే ఏసీలు

హైదరాబాద్ : ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఏసీ, రిఫ్రిజిరేటర్లు, రూమ్ కూలర్లపై పలు ఆఫర్లను అందిస్తున్నట్లు టాటా గ్రూపులో భాగమైన క్రోమా తెలిపింది. వేసవి క్యాంపెయిన్ 2024తో మ్యాజిక్ పేరుతో పలు ఉత్పత్తులపై రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇన్వెర్టర్ స్ప్లిట్ ఏసీల ధరలు రూ.24,990 నుంచి ప్రారంభమవుతాయని తెలిపింది. ఏదైనా కొత్త ఏసీ కొనుగోలుపై గరిష్టంగా రూ6,500 వరకు ఎక్స్ఛేంజీ ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంది.